RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | శనివారం 5-9-2026 | సంచిక: 13 | సంఖ్య: 339 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

# సురేఖ శాఖలు ఇక సీఎం పరిధిలోనే..

## ప్రభుత్వం కీలక ఉత్తర్వులు

దేవదాయ, అటవీ, పర్యావరణ విభాగాలను

రేవంత్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షణ

మంత్రివర్గం నుంచి సురేఖ తొలగింపునకు గవర్నర్ ఆమోదం

కేబినెట్‌లో మూడు ఖాళీలు.. కొత్త మంత్రుల ఎంపికపై కసరత్తు





తెలంగాణ మంత్రివర్గంలో చోటుచేసుకున్న మార్పుల ప్రభావం పరిపాలనపైనా పడింది. మాజీ మంత్రి కొండా సురేఖ వద్ద ఉన్న మూడు కీలక శాఖలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ఆధీనంలోకి తీసుకున్నారు. దేవదాయ, అటవీ, పర్యావరణ విభాగాల నిర్వహణను ఇకపై సీఎం చేపట్టనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.



## సురేఖపై చర్య తీసుకున్నారు..

మరి పొంగులేటిపై ఎందుకు మౌనం?: హరీశ్ రావు

22ఏ భూములపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హరీశ్

కాగజ్‌నగర్‌లో 42,867 ఎకరాల ప్రస్తావన

రైతులతో కలిసి అసెంబ్లీ ముట్టడికి హెచ్చరిక

2,3లో



## కేరళలో నారా లోకేశ్..

కొల్లం జిల్లాలోని అమృతపురి ఆశ్రమం సందర్శన

మాతా అమృతానందమయి ఆశీస్సులు అందుకున్న లోకేశ్

ఆశ్రమంలోని అమృత విశ్వ విద్యాపీఠాన్ని పరిశీలించిన వైనం

ఈ పర్యటన వ్యక్తిగతమని, అధికారికం కాదని సమాచారం

## కొండా సురేఖ తదుపరి అడుగు ఎటువైపు?

- వైరల్ పోస్టులపై మాజీ మంత్రి కీలక వివరణ
- తన పేరుతో చక్కర్లు కొడుతున్న ప్రచారాన్ని ఖండించిన కొండా సురేఖ
- కాంగ్రెస్‌కు దూరమయ్యే ప్రసక్తే లేదని స్పష్టత
- అధికారిక ఖాతాల సమాచారాన్నే పరిగణనలోకి తీసుకోవాలని సూచన



హైదరాబాద్: రాజకీయంగా కీలక పరిణామాల మధ్య తన పేరుతో సామాజిక మాధ్యమాల్లో వెలువడుతున్న సందేశాలపై కొండా సురేఖ స్పష్టత ఇచ్చారు. తన కుటుంబానికి ఎలాంటి సంబంధం లేని కంటెంట్‌ను తన పేరుతో ప్రచారం చేస్తున్నారని, దానిని విశ్వసించవద్దని

2లో

## రాజమండ్రిలో సగం కాలుష్యానికి కారణం ఇదే


### పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తున్న ఆంధ్ర పేపర్ మిల్లు

రాజమండ్రి కాలుష్యంలో సగం ఆ పరిశ్రమ వల్లేనన్న పవన్

పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

కోర్టు కేసులను వేగవంతం చేయాలని న్యాయవాదులకు ఆదేశాలు

స్వచ్ఛ గోదావరి లక్ష్యంగా ముందుకెళతామన్న ప్రభుత్వం



## అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం

ఏపీ అక్షరాస్యతపై మంత్రి లోకేశ్ ప్రకటనను తప్పుబట్టిన జగన్

ఇది పూర్తిగా తప్పుడు సమాచారంతో కూడిన ప్రచారమని విమర్శ

కేంద్ర ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ వివరణ ఇచ్చిన మాజీ సీఎం

ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు తగ్గుతున్నారని ఆందోళన వ్యక్తీకరణ

విద్యాశాఖపై దృష్టి పెట్టాలని లోకేశ్‌కు సూచించిన జగన్



ఏపీలో అక్షరాస్యత రేటు 2024లో 72.6శాతం నుంచి 2026 నాటికి 82.1శాతానికి పెరిగిందంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనపై

2లో



## క్రమశిక్షణ విషయంలో రాజీ లేదు

కొండా సురేఖపై వేటు.. మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

సురేఖ పార్టీలోనే కొనసాగాలని వ్యాఖ్య

భవిష్యత్తులోనూ బీసీలకు కాంగ్రెస్ సముచిత ప్రాధాన్యత ఇస్తుంది: టీపీసీసీ అధ్యక్షుడు

4లో



2లో

## ఆకాశ నేత్రం

జీఎస్ఎల్‌వీ-ఎఫ్ 17 ప్రయోగం విజయవంతం

శ్రీహరికోట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరోసారి చరిత్ర పుటల్లోకి ఎక్కింది. దేశంలో తొలిసారిగా జియో- ఆర్బిట్‌లోకి ఇమేజింగ్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. 2,300 కిలోలకుపైగా బరువున్న ఈ ఉపగ్రహాన్ని జీఎస్ఎల్‌వీ

## ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలతో చంద్రబాబు రేపు కీలక భేటీ

2లో

పీఆర్సీ, కరవు భత్యం తదితర అంశాలపై చర్చించనున్న సీఎం

నిన్న చంద్రబాబును కలిసిన ఏపీ జేఏసీ నేతలు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న ముఖ్యమంత్రి



ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో రేపు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

కొత్త పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ అమలుతో పాటు కరవు భత్యం బకాయిలు తదితర కీలక అంశాలపై ఈ భేటీలో సమగ్రంగా చర్చించనున్నారు. నిన్న సచివాలయంలో



## రాబోయే రోజుల్లో వీటిదే హవా.. కేటీఆర్

ఆన్‌లైన్ కార్యకలాపాలు పెరుగుతున్న కొద్దీ డేటా నిల్వకు భారీ డిమాండ్

ఏఐ, సర్వర్ టెక్నాలజీ, డేటా మేనేజ్‌మెంట్‌లో భవిష్యత్ అవకాశాలు విస్తృతం

హైదరాబాద్‌లో కాన్‌స్టర్ సొల్యూషన్స్ కొత్త కార్యాలయం ప్రారంభం

# సురేఖ శాఖలు ఇక సీఎం పరిధిలోనే..

హైదరాబాద్: మంత్రివర్గం నుంచి సురేఖను తొలగించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు గవర్నర్ ఆమోదం తెలిపిన అనంతరం ఈ మార్పు అమల్లోకి వచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164(1) ప్రకారం గవర్నర్ కార్యాలయం ఆమెను కేబినెట్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు వెలువరించింది. అనంతరం సురేఖ నిర్వహించిన శాఖల బాధ్యతలను ముఖ్యమంత్రి స్వీకరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు శాంతికుమారి జీవో నంబర్ 128 జారీ చేశారు. కొత్తగా మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసే వరకు లేదా శాఖల కేటాయింపుల్లో మార్పులు చేసేంతవరకు ఈ మూడు విభాగాలు సీఎం పర్యవేక్షణలోనే కొనసాగనున్నాయి. సురేఖను కేబినెట్ నుంచి తప్పించడంతో రాష్ట్ర మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న స్థానాల సంఖ్య మూడుకు చేరింది. ఇప్పటికే రెండు స్థానాలు ఖాళీగా ఉండగా.. తాజాగా మరో మంత్రి స్థానం కూడా అందుబాటులోకి వచ్చింది. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం తదుపరి కేబినెట్ కూర్పుపై దృష్టి సారించే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొత్తగా మంత్రివర్గంలోకి ఎవరిని తీసుకోవాలనే అంశంలో సామాజిక, ప్రాంతీయ సమీకరణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బీసీ వర్గాలతో పాటు మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడం, వివిధ ప్రాంతాల మధ్య సమతుల్యత కొనసాగించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కొత్త అభ్యర్థుల ఎంపికపై ఏఐసీసీ స్థాయిలో వ్యూహరచన జరుగుతున్నట్లు సమాచారం.

# కొండా సురేఖ తదుపరి అడుగు ఎటువైపు?

ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం 'ఎక్స్'లో ఈ మేరకు ఆమె వివరణ ఇచ్చారు. తనకు కనిపించిన కొన్ని పోస్టుల్లో త్వరలో కీలక ప్రకటన చేయబోతున్నట్లుగా, ఇప్పటివరకు సాగిన నిరీక్షణ ముగియబోతున్నట్లుగా పేర్కొన్నారని సురేఖ తెలిపారు. అయితే అవి తాను చేసినవి కాదని స్పష్టం చేశారు. నిజమైన సమాచారాన్ని తెలుసుకునేందుకు తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాలను మాత్రమే అనుసరించాలని సూచించారు. ఇదిలా ఉండగా, మంత్రివర్గం నుంచి సురేఖను తప్పించిన వెంటనే ఈ ప్రచారం మొదలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. క్రమశిక్షణకు సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన సిఫార్సును అనుసరించి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం ఆమెను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ ప్రకటన విడుదల చేశారు. దీనికి ముందు కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం నుంచి నిర్ణయానికి ఆమోదం లభించింది. ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తదితరులతో జరిగిన చర్చల అనంతరం ఈ పరిణామం చోటుచేసుకుంది. కొంతకాలం క్రితం వరంగల్ జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో సురేఖ కుమార్తె సుస్మిత సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి కుటుంబంపై పలు ఆరోపణలు చేయడంతో పాటు పరకాల రాజకీయాలపైనా ఆమె తన అభిప్రాయాన్ని వెల్లడించారు. పరకాల సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మద్దతుగా సీఎం చేసిన విజ్ఞప్తిపై అభ్యంతరం వ్యక్తం చేసిన సుస్మిత.. తాను కూడా అదే నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో నిలుస్తానని ప్రకటించారు. ఈ వ్యవహారం కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అంశంగా మారడంతో పార్టీ కమిటీ సురేఖకు వివరణ కోరుతూ నోటీసు పంపింది. కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సాధ్యం కాదంటూ ఆమె సమాధానం ఇచ్చారు. అయితే ఆమె వివరణపై పార్టీ నాయకత్వం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. అనంతరం సురేఖపై చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణ కమిటీ సిఫార్సు చేసింది. మంత్రివర్గం నుంచి తనను తొలగించిన నిర్ణయాన్ని సురేఖ తీవ్రంగా తప్పుబట్టారు. రేవంత్‌రెడ్డి అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకొచ్చి తనపై చర్యలు తీసుకునేలా చేశారని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి పాత్ర ఉందని విమర్శించారు. అయితే రాజకీయంగా తాను తీసుకోబోయే తదుపరి నిర్ణయంపై వస్తున్న ఊహాగానాలకు సురేఖ తెరదించారు. తన భర్త కొండా మురళితో కలిసి కాంగ్రెస్‌లోనే కొనసాగుతామని తెలిపారు. బీజేపీలోకి వెళ్లడం లేదా కొత్త రాజకీయ వేదిక ఏర్పాటు చేయబోతున్నారనే ప్రచారాన్ని ఆమె తిరస్కరించారు. తాను పార్టీ మారడం లేదని స్పష్టంగా ప్రకటించారు.

# రాజమండ్రిలో సగం కాలుష్యానికి కారణం ఇదే

(మొదటి పేజీ తరువాయి)


రాజమండ్రిలోని ఆంధ్ర పేపర్ లిమిటెడ్ (ఏపీఎల్) తీరుపై రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తూ, మరోవైపు గోదావరి నదిని తీవ్రంగా కలుషితం చేస్తూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆయన విరుచుకుపడ్డారు. రాజమండ్రిలో సగం కాలుష్యానికి ఈ కంపెనీయే కారణమని ఆరోపించారు. పద్ధతి మార్చుకోకపోతే పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం దగ్గర నుంచి లైసెన్సు రద్దు వరకు ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీ చేసి, తక్షణమే చర్యలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులను ఆదేశించారు. 2016 నుంచి కాటేరు గ్రామ పంచాయతీకి గానీ, రాజమండ్రి నగరపాలక సంస్థకు గానీ ఆంధ్ర పేపర్ మిల్లు ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించలేదని పవన్ కల్యాణ్ ఆరోపించారు. స్థానిక సంస్థలకు సుమారు రూ. 21.34 కోట్ల మేర పన్నులు బకాయిపడిందని ఆయన తెలిపారు. పన్ను చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేసిన ప్రతిసారీ, యాజమాన్యం కోర్టులను ఆశ్రయించి జాప్యం చేస్తోందని, బాధ్యత నుంచి తప్పించుకుంటోందని మండిపడ్డారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా సొంతంగా పన్ను మినహాయింపు ఇచ్చుకున్నారా? అని ఆయన నిలదీశారు.

**గోదావరిని కమ్మేస్తున్న కాలుష్యం**

అధికారిక గణాంకాల ప్రకారమే రాజమండ్రి నగరంలోని మొత్తం కాలుష్యంలో సగం ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే వస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నగరం మొత్తం మీద రోజుకు 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అయితే, ఒక్క ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలు వెలువడుతున్నాయని వివరించారు. ఈ వ్యర్థ జలాల్లో ప్రమాదకర రసాయనాలు నిర్దేశిత పరిమితికి మించి ఉన్నాయని పరీక్షల్లో తేలిందన్నారు. లాగూన్ల వద్ద సేకరించిన నీటి నమూనాల్లో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) లీటరుకు 36 మిల్లీగ్రాములుగా ఉందని, ఇది ప్రమాణాల కన్నా 20 శాతం అధికమని తెలిపారు. అదేవిధంగా ఫాస్ఫేట్ 6 శాతం, సల్ఫైడ్‌లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల కన్నా ఏకంగా 70 శాతం అధికంగా ఉన్నాయని ఆయన వెల్లడించారు. పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యం వల్ల గోదావరి నీటిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి జలచరాల మనుగడకు ముప్పు వాటిల్లుతోందని, నది సహజ పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోందని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసన, నీటి నాణ్యత క్షీణతతో ప్రజారోగ్యానికి హాని కలుగుతోందని, భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు. గతంలో తాను క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించినా, యాజమాన్యం పట్టించుకోలేదని గుర్తుచేశారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలతో చంద్రబాబు రేపు కీలక భేటీ

ఏపీ జేఏసీ నాయకులు ఎ. విద్యాసాగర్, డీవీ రమణ, భారతీ ప్రసాద్ తదితరులు సీఎం చంద్రబాబును కలిశారు. ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న ఆందోళనలను, ఆర్థికేతర సదుపాయాల పెండింగ్ అంశాలను విద్యాసాగర్ సీఎంకు వివరించి, తక్షణ పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి... ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అత్యంత కట్టుబడి ఉందో స్పష్టం చేశారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగులకు అందాల్సిన న్యాయమైన ప్రయోజనాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి సానుకూలంగా చర్చలు జరుపుతున్న తరుణంలో, ఉద్యోగ సంఘాలు తొందరపడి ఆందోళన బాట పట్టడంపై సీఎం చంద్రబాబు కొంత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సమగ్ర చర్చల వేదిక అందుబాటులో ఉన్నప్పుడు కొద్దిగా ఓర్పు వహించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రితో భేటీపై హర్షం వ్యక్తం చేసిన ఏపీ జేఏసీ నేతలు... ప్రభుత్వం వైపు నుంచి సానుకూల చర్చల ప్రక్రియను స్వాగతిస్తున్నామని, సీఎం స్థాయిలోనే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.



**సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డుల ప్రదానం**

ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం అమలుకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లను నిరుపేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సి ఉండగా, ఈ విధానంలో ఉన్న మార్గదర్శకాలను సవరించి, పటిష్ఠంగా అమలు చేసేందుకు ఒక రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఈ రిజర్వేషన్ ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా చూడటమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేసేందుకు 16 మంది సభ్యులతో కూడిన కమిటీని ప్రభుత్వం నియమించింది. పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించనుండగా, సమగ్రశిక్షా ఎస్పీడీ కన్వీనర్‌గా ఉంటారు. వీరితో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల ప్రతినిధులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు కూడా ఈ కమిటీలో స్థానం కల్పించారు. ఈ ఏడాది జనవరిలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జారీ చేసిన ఆదేశాల నేపథ్యంలో ప్రస్తుత నిబంధనలను సవరించి, పకడ్బందీగా అమలు చేసేందుకు ఈ కమిటీ కృషి చేస్తుందని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కమిటీ త్వరలోనే సమావేశమై కొత్త మార్గదర్శకాలను ప్రభుత్వానికి సిఫార్సు చేయనుంది. మరోవైపు రేపు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విశేష సేవలు అందించిన వారికి 'రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు-2026'ను ప్రకటించింది. మొత్తం 173 మందిని ఈ పురస్కారాలకు ఎంపిక చేసింది. వీరిలో పాఠశాల విద్యా విభాగం నుంచి 79 మంది, ఇంటర్ విద్య నుంచి 24 మంది, సాంకేతిక విద్య నుంచి 14 మంది, ఉన్నత విద్యా విభాగం నుంచి 56 మంది ఉన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వీరికి ప్రశంసాపత్రం, జ్ఞాపిక, పతకం, శాలువాతో పాటు రూ. 20 వేల నగదు బహుమతిని అందించి ఘనంగా సత్కరించనున్నారు.

# కేరళలో నారా లోకేశ్..

ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం కేరళలో పర్యటించారు. కొల్లం జిల్లాలోని ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రమైన మాతా అమృతానందమయి (అమ్మ) ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మను దర్శించుకుని ఆమె ఆశీస్సులు అందుకున్నారు. ఇది పూర్తిగా లోకేశ్ వ్యక్తిగత పర్యటన అని, అధికారిక కార్యక్రమం కాదని తెలుస్తోంది. అమృతపురిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆశ్రమంలో లోకేశ్ దాదాపు మూడు గంటల పాటు గడిపారు. ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న కాళీమాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మను కలుసుకుని ఆశీర్వాదం పొందారు. ఆశ్రమంలోని గజరాజులకు పండ్లు అందించారు. ఈ పర్యటన తనకు ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తినిచ్చిందని లోకేశ్ పేర్కొన్నారు. తన పర్యటనకు సంబంధించిన వివరాలను ఆయన తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా లోకేశ్ అక్కడి విద్యాసంస్థలను కూడా పరిశీలించారు. ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న అమృత విశ్వ విద్యాపీఠంతో పాటు, అమృత ఆయుర్వేద కళాశాలను ఆయన సందర్శించారు. అక్కడి విద్యాబోధన, మౌలిక సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏపీ విద్యాశాఖ మంత్రిగా ఆయన విద్యాపీఠాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# రాబోయే రోజుల్లో వీటిదే హవా.. కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: మొబైల్ వినియోగం, డిజిటల్ కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో భారీ మొత్తంలో సమాచారం పుట్టుకొస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ సమాచారాన్ని భద్రపరచడం, అవసరమైనప్పుడు అందుబాటులోకి తీసుకురావడం కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అవసరమవుతుందని పేర్కొన్నారు. డేటా నిర్వహణ, కృత్రిమ మేధ, సర్వర్ వ్యవస్థలు, డిజిటల్ కంటెంట్ వంటి విభాగాలు భవిష్యత్తులో విస్తృత అవకాశాలకు కేంద్రంగా మారనున్నాయని తెలిపారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఫీనిక్స్ ప్రిజ్మా భవనంలో కాన్‌స్టర్ సొల్యూషన్స్ ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని శుక్రవారం కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం కంపెనీ ప్రతినిధులు, ఉద్యోగులతో ఆయన ముచ్చటించారు. ప్రస్తుతం ప్రజలు సమాచారాన్ని పొందుతున్న తీరులో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కేటీఆర్ వివరించారు. గతంలో పత్రికలు, ఇతర సంప్రదాయ మాధ్యమాల ద్వారా వార్తలు, సమాచారాన్ని తెలుసుకునేవారని.. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్లలో నిరంతరం కొత్త కంటెంట్‌ను వీక్షిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా యువతలో డిజిటల్ కంటెంట్ వినియోగం గణనీయంగా పెరిగిందన్నారు. ప్రతి ఆన్‌లైన్ చర్యతో కొత్త సమాచారం సృష్టి అవుతున్నందున దాన్ని నిల్వ చేయడానికి భారీ మౌలిక సదుపాయాలు అవసరమవుతున్నాయని తెలిపారు. డేటా సెంటర్లు, సర్వర్లు, నిర్వహణ వ్యవస్థలు, ఏఐ ఆధారిత పరిష్కారాల అవసరం రానున్న కాలంలో మరింత పెరుగుతుందని చెప్పారు. ఈ రంగంలో పనిచేస్తున్న సంస్థలు పరస్పర సహకారంతో వినూత్న పరిష్కారాలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. టెక్నాలజీ పరిశ్రమ గత రెండు దశాబ్దాల్లో ఎన్నో మార్పులను చూసిందని కేటీఆర్ పేర్కొన్నారు. అమెరికాలో సుమారు ఏడేళ్లపాటు కార్పొరేట్ రంగంలో పనిచేసిన సమయంలో ఎదురైన అనుభవాలను ఉద్యోగులతో పంచుకున్నారు. వివిధ దేశాల్లోని క్లయింట్లతో సమన్వయం చేసుకోవడం, వేర్వేరు సమయాల్లో విధులు నిర్వహించడం వంటి అంశాలు సవాళ్లతో కూడుకున్నప్పటికీ.. టెక్ రంగం మంచి కెరీర్ అవకాశాలను అందిస్తుందని చెప్పారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ టెక్నాలజీ, వాణిజ్యం, ఆర్థిక సేవలకు అనుకూల కేంద్రంగా ఎదుగుతోందని కేటీఆర్ అన్నారు. ఇక్కడ కొత్త సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించడం నగర ఆర్థిక, వ్యాపార వాతావరణానికి మరింత బలం చేకూరుస్తుందని పేర్కొన్నారు. కాన్‌స్టర్ సొల్యూషన్స్ యాజమాన్యం, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

# ఆకాశ నేత్రం

(మొదటి పేజీ తరువాయి)

రాకెట్ ద్వారా నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. మిషన్‌లో పాల్గొన్న ఓ సీనియర్ శాస్త్రవేత్త అభివర్ణించినట్లుగా 'ఆకాశంలో కన్ను'గా అభివర్ణిస్తున్న ఈ ఉపగ్రహం రియల్ టైమ్ చిత్రాలను అందించనుంది. వ్యవసాయం, విపత్తుల నిర్వహణ తదితర రంగాల్లో దేశానికి ఇది ఎంతగానో ఉపయోగపడనుంది. ఈవోఎస్-05 ఉపగ్రహాన్ని ప్రయోగించిన సుమారు 18 నిమిషాల తర్వాత ఉద్దేశించిన సబ్ జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లో విజయవంతంగా ప్రవేశపెట్టినట్టు ఇస్రో ప్రకటించింది.

**'గూఢచారి ఉపగ్రహం' కాదు**

ఈవోఎస్-05ను 'గూఢచారి ఉపగ్రహం'గా పేర్కొంటూ వస్తున్న ఊహాగానాలను అంతరిక్ష సంస్థ తోసిపుచ్చింది. స్పై అనేది ప్రతికూల పదమని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ అన్నారు. ఈవోఎస్-05ను భారత్‌ను నిరంతరం స్కాన్ చేసి, పరిశీలించేందుకు రూపొందించిన బహుముఖ ప్రయోజన వేదికగా ఆయన పేర్కొన్నారు. ఇది అందించే డేటా దేశ పౌరుల భద్రత, రక్షణను నిర్ధారించేందుకు ఉపయోగపడుతుందని, ఈ ఉపగ్రహాన్ని తొమ్మిదేండ్ల పాటు పనిచేసేలా రూపొందించారని తెలిపారు. 'జీఎస్ఎల్వీ ఎఫ్-17' వాహనం అధునాతన ఈఓఎస్-05 జియో ఇమేజింగ్ ఉపగ్రహాన్ని ఉద్దేశించిన కక్ష్యలోకి ప్రవేశపెట్టిందని ప్రకటించడానికి చాలా సంతోషంగా ఉందన్నారు.

**భూ భ్రమణ వేగానికి సమానంగా..**

ప్రస్తుతం అనేక భూ పరిశీలన ఉపగ్రహాలు లో ఎర్త్ ఆర్బిట్(ఎల్ఈవో)లో పనిచేస్తున్నాయి. అయితే ఈవోఎస్-05 భూమికి సుమారు 36,000 కిలోమీటర్ల ఎత్తులో ఉండే జియోసింగ్రోనస్ ఆర్బిట్‌లోకి చేరనుంది. ఆ ఎత్తులో ఉపగ్రహం భూమి భ్రమణ వేగంతో సమానంగా ప్రయాణిస్తుంది. దీనికి ముందు బుధవారం రాత్రి 23:30 గంటలకు ప్రారంభమైన 27 గంటల కౌంట్‌డౌన్ సజావుగా ముగిసిన అనంతరం రాకెట్ శుక్రవారం తెల్లవారుజామున 2: 55 గంటలకు సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి నిర్ణీత సమయానికి దూసుకెళ్లింది. 2026లో ఇస్రోకు ఇది తొలి విజయవంతమైన ప్రయోగం. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షా తదితరులు ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు.

# అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రంగా స్పందించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 2026 క్యాలెండర్ సంవత్సరం ఇంకా పూర్తి కానందున, అక్షరాస్యతకు సంబంధించి ఏ అధికారిక సంస్థ కూడా గణాంకాలను విడుదల చేయలేదని జగన్ స్పష్టం చేశారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖకు చెందిన ఎన్ఎస్ఎస్ఓ విడుదల చేసిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్) 2023-24 వార్షిక నివేదికను ఆయన ఉటంకించారు. దాని ప్రకారం.. 2023 జూన్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలో ఏపీలో ఏడేళ్లకు పైబడిన వారిలో అక్షరాస్యత 72.6శాతంగా ఉందని, ఇదే 2018-19లో 69.1శాతంగా ఉండేదని గుర్తుచేశారు. అంతేకాకుండా, 2026 జులై 2న ప్రచురించిన పీఎల్ఎఫ్ఎస్ 2025 నివేదిక ప్రకారం.. 2025 జనవరి నుంచి 2025 డిసెంబర్ మధ్య కాలంలో రాష్ట్ర అక్షరాస్యత 71.4శాతంగా నమోదైందని తెలిపారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం తప్పుడు వాదనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం అత్యంత దురదృష్టకరమని జగన్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గి, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడీఐఎస్ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని, ఇది ఆందోళన కలిగించే విషయమని జగన్ అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యను మరింత అందుబాటులోకి ఎలా తీసుకురావాలనే దానిపై దృష్టి పెట్టాల్సింది పోయి, టీడీపీ కూటమి ప్రభుత్వం మోసపూరిత వ్యూహాలతో తప్పుడు ప్రచారాలు చేసుకోవడంలో నిమగ్నమైందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి తన శాఖపై ఎక్కువ సమయం కేటాయించాలి కానీ 'రెడ్ బుక్ గవర్నెన్స్' మీద కాదని లోకేశ్‌కు హితవు పలికారు.



# చిన్నారెడ్డి సంచలన వ్యాఖ్యలు

## పదవి పోయినా వెనక్కి తగ్గేది లేదు..

**తనను ఒక్క నిర్ణయంతో పదవి నుంచి తప్పించడంపై చిన్నారెడ్డి ఆవేదన**

**మల్లు రవినే తనపై చర్యలకు ప్రధాన కారణమని ఆరోపణ**

**భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని వెల్లడి**

**వనపర్తి, సెప్టెంబర్ 4 (నేటి ప్రస్థానం):** కాంగ్రెస్‌లో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న తనకు ఎదురైన పరిణామాలపై మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత చిన్నారెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష బాధ్యతల నుంచి తనను తప్పించిన తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేస్తూ.. పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేసిన తనను ఒక్క నిర్ణయంతో పక్కకు నెట్టేశారని వ్యాఖ్యానించారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం జయన్న తిరుమలాపురంలోని తన వ్యవసాయ క్షేత్రంలో మీడియాతో మాట్లాడారు. తనపై తీసుకున్న చర్య వెనుక పీసీసీ క్రమశిక్షణా కమిటీ అధ్యక్షుడు, ఎంపీ మల్లు రవి వ్యవహారశైలే కారణమని చిన్నారెడ్డి ఆరోపించారు. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి చేసిన ఫిర్యాదును ఆధారంగా చేసుకుని మల్లు రవి ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని ఆయన విమర్శించారు. పార్టీలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులకు కూడా ఇదే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఇటీవల మంత్రి పదవి కోల్పోయిన కొండా సురేఖ అధిష్ఠానాన్ని కలిసేందుకు ఢిల్లీకి వెళ్లినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని చిన్నారెడ్డి ప్రస్తావించారు. అదే పరిస్థితి తనకూ ఎదురవుతుందనే భావనతోనే తాను ఢిల్లీ వెళ్లి పార్టీ పెద్దలను కలవడం గానీ, సీఎం రేవంత్‌రెడ్డిని సంప్రదించడం గానీ చేయలేదని తెలిపారు. కాంగ్రెస్‌లో తన సీనియారిటీని కూడా ఆయన గుర్తుచేశారు. వి.హనుమంతరావు తర్వాత పార్టీలో తానే అత్యంత సీనియర్ నేతనని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 42 మంది ఎమ్మెల్యేలతో వనపర్తిలో భారీ సభ నిర్వహించి, ఉద్యమానికి మద్దతుగా సంతకాలు సేకరించిన విషయాన్ని గుర్తు చేశారు.ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన సమయంలో ఉత్తర్వుల్లో నిర్దిష్ట పదవీకాలాన్ని పేర్కొనలేదని చిన్నారెడ్డి తెలిపారు. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు కొనసాగుతారని మాత్రమే అందులో పేర్కొన్నారని చెప్పారు. కేబినెట్ హోదా కలిగిన పదవిలో ఉన్నప్పటికీ తాను ప్రోటోకాల్ సౌకర్యాలను స్వచ్ఛందంగా వదులుకున్నానని వెల్లడించారు. తన కుమారుడికి రాజకీయ పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి వద్ద ఎప్పుడూ అభ్యర్థించలేదని స్పష్టం చేశారు. పదవి ఉన్నా లేకపోయినా తన గౌరవానికి ఎలాంటి లోటు ఉండదన్నారు. ఇకపై ఏం చేయాలన్న అంశంపై పార్టీ కార్యకర్తలు, అనుచరులతో చర్చించి త్వరలో నిర్ణయం ప్రకటిస్తానని చిన్నారెడ్డి తెలిపారు.

## అక్షర రూపంలో శ్రీకృష్ణ తత్వం.. “శ్రీకృష్ణోదయం ” ఆవిష్కరణ

యాదాద్రి భువనగిరి:- శ్రీకృష్ణుడి నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయని పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భోగా మహేష్ పంతులు తెలిపారు. సంస్థాన్ నారాయణపురం మండలం సిద్దోని గూడెం శివారులోని శ్రీ రాధా వేణుగోపాల స్వామి ప్రాచీన దేవాలయంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ఇమ్మడి నాగేష్ సంకలనం చేసిన శ్రీ కృష్ణోదయం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి ప్రసంగించారు.పరమాత్ముడు ధర్మసంస్థాపనార్థం యుగయుగాల్లో అవతరిస్తుంటాడని తెలిపారు. శ్రీకృష్ణుడు ధర్మరక్షణ కోసం అవతరించి ప్రజలకు భగవద్గీతను అందించారని వివరించారు. అందరూ భగవద్గీతను పాటించా లని అందులోని ధర్మసూత్రాన్ని గ్రహించి ఆచరించాలని సూచించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మురళీకృష్ణ మాట్లాడుత:- ప్రతి ఒక్కరూ ఆందోళన ఒత్తిడి లేని ప్రశాంత జీవనం కోసం ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలన్నారు. శ్రీకృష్ణోదయం గ్రంథ సంకలన కర్త ఇమ్మడి నాగేష్ మాట్లాడుతూ:- శ్రీకృష్ణుడి జన్మ వృత్తాంతాన్ని భగవద్గీత సారాన్ని ప్రజలు తెలుసుకునేందుకు ఈ గ్రంథాన్ని సంకలనం చేసినట్టు చెప్పారు.అనంతరం సిద్దోని గూడెం గ్రామ సర్పంచి ముత్యాల అంజయ్య గ్రంథ సంకలన కర్త ఇమ్మడి నాగేష్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తోకల రామ్ రెడ్డి, లక్ష్మారెడ్డి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్

ఆలేరు: సనత్‌నగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆలేరు బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ కటకం బాలరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనేందుకు జనగాం పట్టణానికి వెళ్తున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆలేరు బైపాస్‌లోని మద్రాస్ హోటల్ సమీపానికి చేరుకోగా కటకం బాలరాజు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా పలు రాజకీ య, సామాజిక అంశాలపై ఇరువురు చర్చించారు. బీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు సోషల్ మీడియా వేదికగా ప్రజా సమస్యలను, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే అంశాలపై తలసాని శ్రీనివాస్‌యాదవ్ పలు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు కటకం బాలరాజు తెలిపారు.తనకు విలువైన సమయం కేటాయించి పార్టీ బలోపేతానికి దిశానిర్దేశం చేసిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు కటకం బాలరాజు కృతజ్ఞతలు తెలిపారు.

## సంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో

# గుమ్మడిదల నుంచి నలుగురికి చోటు






**గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి పురస్కారాలకు ఎంపిక**

**బోధన, విద్యార్థుల ప్రగతి, పాఠశాల అభివృద్ధిలో సేవలకు గుర్తింపు**

**ఎంపికైన వారిని అభినందించిన మండల విద్యాధికారిణి పాలీనా**

**గుమ్మడిదల, సెప్టెంబర్ 4 (నేటి ప్రస్థానం):** ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ముందే గుమ్మడిదల మండలానికి ప్రత్యేక గుర్తింపు లభించింది. మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న నలుగురు టీచర్లు సంగారెడ్డి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా నిర్వహించే గురుపూజోత్సవ కార్యక్రమంలో వీరికి సత్కారం జరగనుంది. ఈ జాబితాలో జడ్పీహెచ్ఎస్ కానుకుంట ప్రధానోపాధ్యాయురాలు ఎం. నీరజ, జడ్పీహెచ్ఎస్ నల్లవల్లి ఉపాధ్యాయుడు కే. రాజారెడ్డి, జడ్పీహెచ్ఎస్ కానుకుంట ఉపాధ్యాయుడు యు. అప్పిరెడ్డి, ఎంపీపీఎస్ మంబాపూర్ టీచర్ ఎం. విజయ్ కుమార్ ఉన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంలో చూపిన నిబద్ధతతో పాటు తరగతి గది బోధనలో అనుసరిస్తున్న పద్ధతులు, విద్యార్థుల ప్రగతికి చేస్తున్న కృషి, పాఠశాలల్లో తీసుకొచ్చిన అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు పరిశీలించి పురస్కారాలకు వీరిని ఎంపిక చేశారు. మండలం నుంచి ఒకేసారి నలుగురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి గౌరవానికి ఎంపిక కావడంపై విద్యాశాఖ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా మండల విద్యాధికారిణి పాలీనా ఎంపికైన ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, వారి సేవలకు జిల్లా స్థాయిలో గుర్తింపు రావడం గుమ్మడిదల మండలానికి గౌరవంగా నిలుస్తుందని తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలో

# వర్గపోరు లేదు..

**నాయకులంతా ఏకతాటిపై ఉన్నారు: వివేక్ వెంకటస్వామి**

**కాంగ్రెస్ నేతలంతా రాష్ట్ర అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నారన్న వివేక్**

**వెయ్యి రోజుల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని వెల్లడి**

**22ఏ జీవోను పునఃపరిశీలిస్తున్నామన్న మంత్రి**



కాంగ్రెస్ పార్టీలో ఎక్కడా వర్గపోరు లేదని, నాయకులంతా ఏకతాటిపై నిలిచి పార్టీ బలోపేతంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారని తెలంగాణ మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నో చారిత్రాత్మక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజాదరణ పొందిందని వెల్లడిం చారు. రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన 22ఏ నిరోధిత భూముల వివాదంపై మంత్రి స్పందిస్తూ... ఈ సమస్య ముమ్మాటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాల వల్లే ఉత్పన్నమైందని మండిపడ్డారు. ఆనాటి జీవోను పునఃపరిశీలించి, సవరణలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందని, ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా నిరోధిత జాబితా చిక్కులను త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రతికూలంగా ఉన్నప్పటికీ, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిబద్ధతతో నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలు, డిజైన్ లోపాల వల్లే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ఆరోపించిన మంత్రి వివేక్, ఈ వైఫల్యంపై మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు ప్రజలకు బహిరంగ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు ఉనికి కోసమే ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, గత పదేళ్ల స్వార్థ పాలనను ప్రజలు ఇంకా మరచిపోలేదని ఆయన వ్యాఖ్యానించారు.



# ముకుందా ...ముకుందా

**ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు వేడుకలు**

**వేములపల్లి:** నల్గొండ జిల్లా వేములపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నా రు.కృష్ణాష్టమి సందర్భంగా పలుచోట్ల ఉట్టి కొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టేందుకు పోటీపడ్డారు. కార్యక్రమాలను తిలకించేందుకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చిన్నారులను తల్లిదండ్రులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించి వేడుకల్లో పాల్గొనడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.పలు గ్రామాల్లో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, భక్తి గీతాలు నిర్వహించారు. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# సురేఖపై చర్య తీసుకున్నారు..

**మరి పొంగులేటిపై ఎందుకు మౌనం?: హరీశ్ రావు**

**22ఏ భూములపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హరీశ్**

**కాగజ్‌నగర్‌లో 42,867 ఎకరాల ప్రస్తావన**

**రైతులతో కలిసి అసెంబ్లీ ముట్టడికి హెచ్చరిక**



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నేటి ప్రస్థానం):** రాష్ట్రంలో 22ఏ భూముల అంశాన్ని ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. నిషేధిత భూముల వ్యవహారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇద్దరి మధ్య ఉన్న సంబంధం ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. పేదలు, రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో చేర్చడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. ముఖ్యంగా కాగజ్‌నగర్ నియోజకవర్గంలో 42,867 ఎకరాల పట్టా భూములు నిషేధిత జాబితాలో చిక్కుకున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించి అర్హులైన రైతుల భూములను జాబితా నుంచి తొలగించాలని కోరారు. రైతుల భూ సమస్యల విషయంలో ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్న తీరుపైనా హరీశ్‌రావు మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి సొంత నివాసానికి సంబంధించిన భూమి కూడా 22ఏ పరిధిలోకి వచ్చిందని, ఆంక్షలు తొలగించుకున్నారని ఆయన ఆరోపించారు. అదే విధంగా సామాన్యుల భూముల విషయంలో ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. 22ఏ జాబితాలో భూములు ఉండటంతో బ్యాంకుల నుంచి రుణాలు పొందలేక రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమ భూముల గురించి ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులుగా పేర్కొనడం సరికాదని, ఆ వ్యాఖ్యలకు సీఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించకపోతే రాష్ట్రంలోని బాధిత రైతులను సమీకరించి అసెంబ్లీ ముట్టడి చేపడతామని హరీశ్‌రావు హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూ రాజకీయాలు సాగుతున్నాయని విమర్శిస్తూ.. ఇది ‘ఇందిరమ్మ రాజ్యమా? లేక కబ్జాల రాజ్యమా?’ అని ప్రశ్నించారు.




## పింఛన్ దరఖాస్తుదారులకు గుడ్‌న్యూస్..

### పత్రాలు లేకపోయినా అప్లై చేసుకోవచ్చు!

**ధ్రువపత్రాలు లేకున్నా ముందుగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు**

**తనిఖీ సమయంలో మాత్రం సంబంధిత పత్రాలు చూపించడం తప్పనిసరి**

**కొత్త పింఛన్ల కోసం ఈ నెల 15 వరకు మాత్రమే అవకాశం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నేటి ప్రస్థానం):** కొత్తగా సామాజిక భద్రత పింఛన్ పొందాలని ఎదురు చూస్తున్న వారికి ప్రభుత్వం కీలక వెసులుబాటు కల్పించింది. అవసరమైన ధ్రువపత్రాలు చేతికి రాకపోయినా దరఖాస్తు ప్రక్రియను ఆపాల్సిన అవసరం లేదని సెర్ప్ స్పష్టం చేసింది. దీంతో సర్టిఫికెట్ల జారీ ఆలస్యం కారణంగా దరఖాస్తు చేసే అవకాశం కోల్పోతామనే ఆందోళనకు తెరపడింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. అయితే దివ్యాంగత్వ నిర్ధారణ పత్రాలు, కులం, ఆదాయం, మరణ ధ్రువపత్రాలు పొందేందుకు కొంత సమయం పడుతోందని పలువురు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సదరం శిబిరాలు, రెవెన్యూ, తహసీల్దార్ కార్యాలయాల నుంచి పత్రాలు తీసుకునే ప్రక్రియ ఆలస్యమవుతుండటంతో అర్హులైన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని సెర్ప్ కీలక సూచన చేసింది. పత్రాలు సిద్ధమయ్యే వరకు వేచి ఉండకుండా ముందుగా ఆన్‌లైన్ ద్వారా లేదా సంబంధిత మీసేవ కేంద్రాల్లో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. అంటే ధ్రువీకరణ పత్రాల లభ్యత దరఖాస్తు నమోదుకు తప్పనిసరి అడ్డంకి కాదని స్పష్టం చేసింది. అయితే దరఖాస్తు తర్వాత జరిగే పరిశీలన దశలో మాత్రం నిబంధనలు వర్తిస్తాయి. అధికారులు వివరాలను ధ్రువీకరించే సమయంలో అర్హతకు సంబంధించిన అన్ని పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అందువల్ల దరఖాస్తు నమోదు చేసిన వెంటనే అవసరమైన ధ్రువపత్రాలను పొందే ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. మరోవైపు కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్ 15ను తుది గడువుగా నిర్ణయించారు. అర్హత ఉన్నప్పటికీ ఇంకా దరఖాస్తు చేసుకోని వారు చివరి తేదీ కోసం ఎదురుచూడకుండా వెంటనే ప్రక్రియ పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గడువు దాటిన తర్వాత వచ్చే దరఖాస్తులపై పరిశీలన ఉండకపోవచ్చని స్పష్టం చేశారు.

## ఘనంగా విడం సాయి కిషోర్ నేత జన్మదిన వేడుకలు

**యాదాద్రి భువనగిరి:-**సంస్థాన్ నారాయణపురం మండలం పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు విడం సాయి కిషోర్ నేత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల లింగస్వామి పాల్గొని విడం సాయి కిషోర్ నేతకి శాలువా కప్పి సన్మానం చేసి పుట్టినరోజు సందర్భంగా విడం సాయి కిషోర్ నేతకి నారాయణపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో పద్మశాలి తెలంగాణ స్వాతంత్ర సమరయోధుడు, ఆచార్య శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటాన్ని బహుకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు చిలుకూరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కోన్రెడ్డి నరసింహ, కారోబార్ పున్నం యాదగిరి, వార్డు సభ్యులు సురపల్లి వెంకటేశం, సింగం భాస్కర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, దూసరి వెంకటేశం గౌడ్, రిపోర్టర్ సింగం కృష్ణ, గునిగంటి రాజు గౌడ్, నీళ్ల శంకర్, మారగోని శంకర్ గౌడ్, బానోతు కిరణ్ నాయక్, కర్నాటి నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## 1000 రోజుల దగాకోరు కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ పోరుబాట!

**మహిళలకు ఇచ్చిన మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం: సుర్వి యాదయ్య గౌడ్**



ఎన్నికల సమయంలో మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత 1000 రోజులు గడిచినా హామీలను అమలు చేయకుండా మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ పోరుబాట చేపట్టింది. నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గంలోని చండూరు పట్టణంలో బీఆర్ఎస్ మహిళా నాయకులు భారీ ధర్నా, వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి భారత రాష్ట్ర సమితి పార్టీ రాష్ట్ర నాయకుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ప్రజలకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మహిళల హక్కుల కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు.

# కొడంగల్‌పై సీఎం ప్రత్యేక దృష్టి..

- విద్యా సంస్థల పనులపై రేవంత్ రెడ్డి ఆరా
- మార్చిలోగా డిగ్రీ కాలేజీ పూర్తి చేయాలి: సీఎం
- అదనపు స్థలంపై వెంటనే సర్వే చేయాలని ఆదేశించిన రేవంత్ రెడ్డి
- భూమి దాతలకు 'ఇందిరమ్మ' ఇళ్లు మంజూరు చేయాలి: సీఎం రేవంత్



**మద్దూరు, సెప్టెంబర్ 4 (నేటి ప్రస్థానం):** కొడంగల్ నియోజకవర్గంలో విద్యా మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. మద్దూరు మున్సిపల్ కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గురుకుల భవనాల పనులను ఆయన స్వయంగా పరిశీలించి, నిర్మాణాల ప్రస్తుత పరిస్థితిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా మద్దూరుకు చేరుకున్న సీఎం.. ముందుగా డిగ్రీ కళాశాల నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించారు. భవన పనులను త్వరితగతిన పూర్తి చేసి మార్చి నాటికి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు కళాశాలలో తరగతులు నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కళాశాలకు మరింత విస్తీర్ణం అవసరమని భావించిన సీఎం.. సమీపంలోని భూమిని పరిశీలించి అవసరమైన మేరకు సేకరించే ప్రక్రియను ఆలస్యం చేయవద్దని జిల్లా కలెక్టర్ ప్రియాంకకు సూచించారు. ఇందుకు సంబంధించిన సర్వేను తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. అనంతరం గురుకుల నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించిన రేవంత్‌రెడ్డి.. భవనం కోసం తమ భూమిని స్వచ్ఛందంగా ఇచ్చిన దాతలను అభినందించారు. భూమి సమకూర్చిన వారికి ప్రభుత్వం తరపున 'ఇందిరమ్మ ఇళ్లు' మంజూరు చేసే ప్రక్రియను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణాల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పనుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని సీఎం స్పష్టం చేశారు.

## సురేఖకు బీఆర్ఎస్‌లో నో ఎంట్రీ..

### జగదీశ్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

**బీఆర్ఎస్‌లోకి వచ్చే అవకాశం ఉన్నా సురేఖను అంగీకరించబోమన్న జగదీశ్‌రెడ్డి**

**తెలంగాణ భవన్ గడప కూడా తొక్కనివ్వబోమంటూ స్పష్టీకరణ**

**రాజగోపాల్‌రెడ్డి విషయంలోనూ బీఆర్ఎస్ వైఖరి స్పష్టమని వెల్లడి**






**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నేటి ప్రస్థానం):** మాజీ మంత్రి కొండా సురేఖ విషయంలో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆ పార్టీ వైఖరిని స్పష్టం చేశారు. సురేఖ తమ పార్టీలో చేరేందుకు ప్రయత్నించినా అవకాశం ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. సురేఖకు బీఆర్ఎస్‌లో స్థానం లేదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్ వైపు కూడా ఆమె అడుగుపెట్టకుండా చూస్తామని జగదీశ్‌రెడ్డి తీవ్రంగా వ్యాఖ్యానించారు. సురేఖ అంశంపై పార్టీ నిర్ణయం ఎటువంటి సందేహానికీ తావులేకుండా స్పష్టంగా ఉందన్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అంశాన్ని కూడా జగదీశ్‌రెడ్డి ప్రస్తావించారు. ఆయన బీఆర్ఎస్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నా స్వీకరించబోమని చెప్పారు. గత ఎన్నికలకు ముందే కోమటిరెడ్డి సోదరులు బీఆర్ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపినప్పటికీ తాము వారిని పార్టీలోకి తీసుకోలేదని గుర్తుచేశారు. రాజగోపాల్‌రెడ్డికి కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రి పదవి కట్టబెడితే.. అది డబ్బుకు ప్రాధాన్యం ఇచ్చినట్లేనని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ నాయకత్వం తీసుకునే నిర్ణయాలను ఈ కోణంలోనే చూడాల్సి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

## సీతారామచంద్రస్వామి ఆలయానికి భూమి పూజ చేసిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**పెగడపల్లి సెప్టెంబర్:** పెగడపల్లి మండలం రాంబద్రుని పల్లె గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భూమి పూజ చేశారు ఆలయ నిర్మాణానికి సంబంధించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు అనంతరం మంత్రి మాట్లాడుతూ ఆలయాలు మన ఆధ్యాత్మిక సంస్కృతి క సంప్రదాయాలకు పప్రతీకలను అన్నారు గ్రామ ప్రజలు అందరూ ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి భాగస్వాములు కావాలని కోరారు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు గ్రామ ప్రజలు అందరూ విరాళాలు సేకరించి ఆలయ నిర్మాణానికి పాలు పంచుకోవాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు







### క్రమశిక్షణ విషయంలో

## రాజీ లేదు

**కొండా సురేఖపై వేటు..**

**మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు**

**సురేఖ పార్టీలోనే కొనసాగాలని వ్యాఖ్య**

**భవిష్యత్తులోనూ బీసీలకు కాంగ్రెస్ సముచిత ప్రాధాన్యత ఇస్తుంది: టీపీసీసీ అధ్యక్షుడు**

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే నేతలపై చర్యలు తప్పవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాలు బాధ కలిగించినా.. సంస్థాగత క్రమశిక్షణను కాపాడటం అత్యంత ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించిన వ్యవహారంపై స్పందించారు. (పార్టీపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలను సురేఖ ఖండించకపోవడాన్ని ఏఐసీసీ తీవ్రంగా పరిగణించిందని మహేశ్ గౌడ్ తెలిపారు. ఈ వ్యవహారంపై క్రమశిక్షణ కమిటీ సమర్పించిన నివేదికను పరిశీలించిన అనంతరం అధిష్ఠానం నిర్ణయం తీసుకుందని వివరించారు. పార్టీలో నేతలకు తమ సమస్యలు, అభిప్రాయాలను వెల్లడించేందుకు పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి వంటి అంతర్గత మార్గాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వాటిని వినియోగించకుండా బహిరంగంగా మీడియా ముందుకు వచ్చి పార్టీపై వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. నాయకులు మాట్లాడే సమయంలో హద్దులు దాటితే చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అయితే కొండా సురేఖ కాంగ్రెస్‌లోనే కొనసాగాలని తాను కోరుకుంటున్నట్లు మహేశ్ గౌడ్ వెల్లడించారు. ఆమె పార్టీతో కలిసి పనిచేస్తే రానున్న రోజుల్లో తగిన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎవరినైనా రాజకీయంగా బెదిరించాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులోనూ బీసీలకు సముచిత ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు దారితీసిన నేపథ్యంలో మహేశ్ గౌడ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



## నెల్లూరు సర్వేపల్లి కాలువ కట్టవాసుల

# 60 ఏళ్ల నిరీక్షణకు తెర

60 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం

1,215 పేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా కేబినెట్ నిర్ణయం

మంత్రి నారాయణ చొరవతో సీఎం చంద్రబాబు ఆమోదం

త్వరలో సీఎం చేతుల మీదుగా పట్టాల పంపిణీకి ఏర్పాట్లు

**నెల్లూరు నగరంలో ఆరు దశాబ్దాలుగా నలుగుతున్న తీవ్రమైన సమస్యకు ఏపీప్రభుత్వం పరిష్కారం చూపింది. సర్వేపల్లి కాలువ కట్టపై నివసిస్తున్న సుమారు 1,215 నిరుపేద కుటుంబాలకు శాశ్వత నివాస హక్కు కల్పిస్తూ ఇళ్ల పట్టాలు మంజూరు చేసేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. దశాబ్దాల తరబడి అభద్రతాభావంతో జీవిస్తున్న పేదల సొంతింటి కలను నెరవేరుస్తూ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.**

**ఏళ్ల తరబడి ఎదురుచూపులు..**

గత 60 ఏళ్లుగా సర్వేపల్లి కాలువ కట్టపై వేలాది మంది నిరుపేదలు నివాసముంటున్నారు. అయితే, ఆ స్థలాలకు వారికి చట్టబద్ధమైన హక్కులు లేవు. కాలువ పోరంబోకు భూమి కావడంతో, ఎప్పుడు తమ నివాసాలు ఖాళీ చేయిస్తారోనన్న భయంతోనే వారు జీవనం సాగిస్తున్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు పట్టాలు ఇస్తామని హామీలు ఇచ్చినా, అవి కార్యరూపం దాల్చలేదు. దీంతో అక్కడి ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

**మంత్రి నారాయణ చొరవతో పరిష్కారం..**

ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారాయణ, ఈ దీర్ఘకాలిక సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. కాలువ కట్ట వాసుల ఇబ్బందులను, వారి ఆవేదనను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఇటీవల భగత్ సింగ్ కాలనీ వాసుల సమస్యను పరిష్కరించిన స్ఫూర్తితో, ఈ అంశాన్ని కూడా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి, మొత్తం 62.70 ఎకరాల భూమిలో 22.31 ఎకరాలను కెనాల్ పోరంబోకు నుంచి 'ఏడబ్ల్యూ డ్రై'గా వర్గీకరణ మార్చేందుకు ఆమోదం తెలిపారు. ఈ ప్రక్రియలో కాలువ నిర్వహణ హక్కులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ నిర్ణయంతో 1,215 కుటుంబాలకు అధికారికంగా ఇళ్ల పట్టాలు పొందేందుకు మార్గం సుగమమైంది.

ప్రభుత్వ నిర్ణయం పట్ల మంత్రి నారాయణ హర్షం వ్యక్తం చేశారు. 60 ఏళ్ల కలను నిజం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తామని ప్రకటించారు. కేబినెట్ నిర్ణయంతో సర్వేపల్లి కాలువ కట్ట వాసులు సంబరాలు చేసుకుంటున్నారు. తమ చిరకాల స్వప్నాన్ని నెరవేర్చిన సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణలకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# హరీశ్‌రావుకు కవిత బహిరంగ సవాల్..

- భార్యను బరిలోకి దింపాలంటూ వ్యాఖ్యలు
- తనపై పోటీకి హరీశ్‌రావు భార్యను నిలబెట్టాలని కవిత సవాల్
- సిద్దిపేట లేదా బోధన్ నుంచి ఎన్నికల బరిలోకి దిగే యోచన
- తెలంగాణ ముఖ్యమంత్రి కావాలన్న ఆకాంక్షను వెల్లడించిన కవిత



హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నేటి ప్రస్థానం): తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వ్యక్తిగత సవాళ్లతో మాటల యుద్ధం మొదలైంది. కొత్తగా తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేసిన కల్వకుంట్ల కవిత.. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావును ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హరీశ్‌రావుకు నిజంగా ధైర్యం ఉంటే ఆయన భార్యను తనపై ఎన్నికల్లో పోటీకి నిలపాలని ఆమె సవాల్ విసిరారు. తనను ఎదుర్కొనేందుకు ఎవరొచ్చినా ఎన్నికల సమరంలో తాను సిద్ధమేనని కవిత ప్రకటించారు. హరీశ్‌రావు ప్రత్యక్షంగా తనతో తలపడకుండా పరోక్షంగా రాజకీయ వ్యవహారాలను నడిపిస్తున్నారని ఆమె విమర్శించారు. రాజకీయాలను పక్కన పెట్టి ఆయన భార్యను ఎన్నికల బరిలోకి తీసుకొచ్చినా తాను స్వాగతిస్తానని పేర్కొన్నారు. గతంలో సిద్దిపేట నియోజకవర్గం నుంచి హరీశ్‌రావుపై పోటీ చేస్తానని తాను ప్రకటించిన విషయాన్ని కవిత మరోసారి ప్రస్తావించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేటతో పాటు బోధన్ నియోజకవర్గాల్లో ఏదో ఒక స్థానం నుంచి పోటీ చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఇదే సమయంలో తన రాజకీయ లక్ష్యాలపైనా కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు ముఖ్యమంత్రి కావాలన్న కోరిక తనకు ఉందని బహిరంగంగా తెలిపారు. సీఎం పదవికి కేవలం అధికారం మాత్రమే కాకుండా గౌరవం, హోదాకు తగిన ఔన్నత్యం కూడా అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. మరోవైపు హరీశ్‌రావుపై కవిత రాజకీయ ఆరోపణలు చేశారు. బీజేపీతో ఆయన రహస్య అవగాహనతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేసిన నేపథ్యంలో కవిత చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

## కాంగ్రెస్ పాలనకు నిరసనగా

# బీఆర్ఎస్ వంటా వార్పు

మహాలక్ష్మి హామీల అమలులో ప్రభుత్వం విఫలం: మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆలేరు పట్టణంలోని దొంతిరి సోమిరెడ్డి గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాలక్ష్మి పథకం హామీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తున్నా మహిళలకు ఇచ్చిన మహాలక్ష్మి హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500, మహిళలకు రూ.1 లక్ష విలువైన తులం బంగారం, స్కూటీలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి.. నేటికీ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని ఆరోపించారు.మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం పాలనతో రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాం డ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్‌గౌడ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు సీసా మహేశ్వరి, మండల అధ్యక్షురాలు అనసూర్య, ఆత్మకూరు మండల అధ్యక్షురాలు సోలిపురం అరుణ, కౌన్సిలర్లు పాకాల మౌనిక హరీష్, బీజని కళ్యాణి మధు, సర్పంచులు బీసు భాగ్యలక్ష్మి, రాఘవపురం సర్పంచ్ పరిధె మమత సంతోష్, శారాజుపేట గ్రామ వార్డు సభ్యురాలు చిలుకు నిరోష స్వామి, మోరిగాడి ఇందిర, స్వరూప, పారుపల్లి లావణ్య, కవితతో పాటు బీఆర్ఎస్ నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుడు చిలుకు స్వామికి ఘన సన్మానం

ఆలేరు, సెప్టెంబర్ 4.తెలంగాణ ఉద్యమకారుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత డాక్టర్ చిలుకు స్వామిని తెలంగాణ మలిదశ ఉద్యమకారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారుల పాత్ర గణనీయమైనదని వారు గుర్తుచేశారు.ఈ సందర్భంగా డాక్టర్ చిలుకు స్వామి మాట్లాడుతూ.. ఆలేరులో నిర్మించనున్న తెలంగాణ అమరవీరుల స్తూపం నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడికి తగిన గుర్తింపు, ప్రతిఫలం దక్కాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారుల ఆలేరు మండల కో-కన్వీనర్ ఇక్కిరి శ్రీనివాస్, నాయకులు మొరిగాడి అశోక్, ఆడెపు బాలస్వామి, ఆర్. జనార్ధన్, కర్రె అశోక్, కళ్లెపు అడవయ్య, ఎర్ర జాన్సన్, చిమ్మి అబ్బ సాయిలు, జింకల రామకృష్ణ, కంతి మహేందర్, బేతి రాములు తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఆలేరులో విద్యార్థి--యువజన ర్యాలీ

**ఆలేరు, సెప్టెంబర్ 4:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శనివారం ఆలేరులో విద్యార్థి--యువజన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆలేరు మండల బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు ఐలి కృష్ణగౌడ్ తెలిపారు.సెప్టెంబర్ 5న ఉదయం 9 గంటలకు ఆలేరులోని పాల సెంటర్ నుంచి బస్టాండ్ వరకు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు .ర్యాలీలో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కృష్ణగౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను విస్మరిస్తోందని విమర్శించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

## లేబర్ సెల్ యాదాద్రి భువనగిరి జిల్లా కన్వీనర్‌గా జంపాల శ్రీనివాస్

ఆలేరు, సెప్టెంబర్ 4 : బీజేపీ లేబర్ సెల్ యాదాద్రి భువనగిరి జిల్లా కన్వీనర్‌గా జంపాల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర లేబర్ సెల్ కన్వీనర్ అందే శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా జంపాల శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం, పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ జిల్లాలో లేబర్ సెల్‌ను మరింత బలోపేతం చేస్తానని తెలిపారు.తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర బీజేపీ జనరల్ సెక్రటరీ వేముల అశోక్, పాశం భాస్కర్, జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.తనను ఆదరించి ఆశీర్వదించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, అభిమానులను జంపాల శ్రీనివాస్ కోరారు.

# సన్నబియ్యం విక్రయిస్తే రేషన్ కార్డుకు ముప్పేనా? తుమ్మల హెచ్చరిక

ప్రభుత్వం అందించే సన్నబియ్యాన్ని విక్రయిస్తే కార్డు రద్దు చేస్తామన్న మంత్రి

గుడిసెలో నివసించే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సూచన

పోడు భూముల సమస్యను పరిష్కరిస్తామని, పామాయిల్ సాగుకు ప్రోత్సాహమని వెల్లడి

**ఖమ్మం జిల్లా, సెప్టెంబర్ 4 (నేటి ప్రస్థానం):** ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అర్హులైన పేదలకే అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ సన్నబియ్యాన్ని బయట విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, అలాంటి వారికి రేషన్ కార్డులు రద్దు చేసే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రఘునాథపాలెం మండలం పుటాని తండాలో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. పార్టీతో సంబంధం లేకుండా ఆర్థికంగా వెనుకబడిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వ సహాయం అందించడంలో స్థానిక ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. అర్హులకు గృహాలు అందకపోతే సర్పంచ్ పదవిపై కూడా ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. పోడు భూముల అంశాన్ని కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తుమ్మల తెలిపారు. పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో



పెట్టుకుని వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, పంటల దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడవచ్చని చెప్పారు. తీవ్రమైన కరువు వచ్చే అవకాశాలపై శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని తెలిపారు. తక్కువ నీటి లభ్యతలోనూ సాగు చేయగల పంటగా ఆయిల్‌పామ్‌ను మంత్రి సూచించారు. పామాయిల్ సాగు చేపట్టే రైతులకు అవసరమైన సహాయాన్ని ఉచితంగా అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రఘునాథపాలెం మండలానికి శుక్రవారం రాత్రి నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. మరుసటి రోజు నుంచి రైతులు మోటార్లు వినియోగించుకోవచ్చని చెప్పారు. ఆర్‌వీఎఫ్‌ఆర్ పట్టాలు కలిగిన వారికి బోర్ల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని తుమ్మల వెల్లడించారు. సుమారు రూ.75 కోట్లతో 200 డొంక రహదారులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే మార్గాలను కూడా మెరుగుపరుస్తామని చెప్పారు. విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు మంత్రి పేర్కొన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్య ద్వారానే పేద కుటుంబాల జీవన పరిస్థితుల్లో శాశ్వత మార్పు సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారని తుమ్మల పేర్కొన్నారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

## ఎడిటోరియల్

**ఆక్వారంగంకు దెబ్బమీద దెబ్బ తగులుతోంది. డాలర్ల పంటగా పేరు గడించిన ఆక్వా పరిశ్రమ వరుస ఇబ్బందులతో సతమతమవుతోంది. దేశంలో రాష్ట్రానికి అత్యధిక విదేశీ మారక ద్రవ్యాన్ని తెచ్చిపెడుతోన్న ఆక్వా పరిశ్రమ మొత్తం మీద నష్టాల ఊబిలోకి వెళ్తోంది. మొన్నటి వరకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బాదిన టారీఫ్ బాదుడుకు కుదేలైన ఏపీలోని ఆక్వా రంగం. ఎక్స్ ఫోర్టర్ల సిండికేట్‌కు మరింత నష్టపోయి లబోదిబో మంటోంది.**



## ఆక్వారంగంకు దెబ్బమీద దెబ్బ

ఇప్పుడు అనుకూలించని వాతావరణం మరో రకంగా దెబ్బతీసింది. నాణ్యత లేని సీడ్‌ను అంటగట్టిన హేచరీల నిర్వాకానికి ఆక్వా రైతులు మరింత నష్టాల ఊబిలోకి వెళ్లిపోయే పరిస్థితి దాపురించింది. నాణ్యత లేని సీడ్ కారణంగా రోజులు గడుస్తున్నా రొయ్యల ఎదుగుదల్లో ఎటువంటి మార్పు లేకపోగా పెట్టుబడి మాత్రం నీళ్లలో పోసినట్టుంది. నాసిరకం సీడ్‌ను చెరువుల్లో వేయడం ద్వారా పెట్టిన పెట్టుబడితోపాటు పంటకాల వ్యవధి నష్టపోతుండగా ఈ వైరస్ మూలాలు తొలగించుకునేందుకు డిస్ ఇన్ఫెక్షన్ ఖర్చుకు మరో రూ.30వేలు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు..అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆక్వా రైతులకు ఇప్పుడు పిడుగులాంటి నిజం తెలిసి లబోదిబో మంటున్నారు. ఎన్నో ఆశలతో చెరువుల్లో సీడ్ వేసిన రైతులకు 40 రోజుల నుంచి 60 రోజుల కాల వ్యవధి దాటుతున్నా 200 కౌంట్‌ను దాటి రావడం లేదు. చెరువుల్లో రోజూ వారీ మేత చల్లడం, ఏరియేటర్ల నిర్వహణ, ఇతర మందులు వేయడం అన్నీ సజావుగా జరుగుతున్నా ఎదగని రొయ్యలను చూసిన రైతులు కంగారుపడుతున్నారు. ఏమయ్యిందా అన్న అనుమానంతో సర్టిఫైడ్ ల్యాబ్‌లో టెస్ట్‌లు చేయించారు. దీంతో అసలు రంగు బయట పడింది. పరీక్షకు పంపిన రొయ్యల్లో ఈహెచ్‌పీ తెగులు ఉన్నట్లు వెల్లడైంది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరులో చాలా మంది రైతులు బాపట్లకు చెందిన హేచరీ నుంచి సీడ్‌ను కొనుగోలు చేశారు. చెయ్యేరుకు చెందిన నాగు అనే రైతు ఈ హేచరీ నుంచి ఈ ఏడాది అక్టోబర్ 8, 9 తేదీల్లో 57.81లక్షల సీడ్‌ను కొనుగోలు చేశాడు. చెరువుల్లో వేసిన రొయ్యపిల్ల ఎటువంటి ఎదుగుదల కనిపించకపోయేసరికి అనుమానంతో నవంబర్ 6న శ్రీ కోనసీమ పీసీఆర్ ఆక్వా ల్యాబ్‌లో టెస్ట్‌లు చేయించారు. రిజల్ట్‌లో ఈహెచ్‌పీ పాజిటీవ్ రాగా హేచరీ సీడ్ నాణ్యత లేనిదని తేలిందని రైతులు వాపోయారు. వారు సరఫరా చేసిన సీడ్‌లో నాణ్యత లేదని, ఈహెచ్‌పీ పాజిటీవ్ ఉన్న సీడ్ అని తెలిసినా కూడా సదరు హేచరీ ఉద్దేశ్యపూర్వకంగానే రైతులను మోసం చేసిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఖచ్చితంగా తెగులు సోకిన సీడ్‌ను సదరు హేచరీ అంటగట్టడం వల్లనే తామంతా తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. నాణ్యత లేని సీడ్‌ను రైతులకు అంటగట్టి చేతులు దులుపుకున్నబాపట్ల హేచరీపై నవంబర్ 22న కోనసీమ జిల్లా ఫిషరీష్ జేడీకు చెయ్యేరు రైతులు ఫిర్యాదు చేశారు. నాణ్యత కలిగిన సీడ్ అనిచెప్పి వ్యాధి ఉన్నది అంటగట్టిందని, నమ్మిన రైతులను మోసం చేయడమే కాకుండా రైతుల నష్టాలకు కారణం అయ్యిందని దీనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. అంతే కాకుండా నష్టపోయిన రైతులకు పూర్తి పెట్టుబడి పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో స్టేట్ ఫిషరీస్ కో ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డికి చెయ్యేరు దాసులమ్మ ఆక్వారైతు ఆసోసియేషన్ ఫిర్యాదు చేసింది.. ఈహెచ్‌పీ వ్యాధి సీడ్‌తో నష్టపోయామని చెయ్యేరు దాసులమ్మ ఆక్వారైతు అసోసియేషన్ రైతుల ఫిర్యాదుతో బుధవారం ఎన్ఎస్‌పీఏఏడీ, సిఫ్ట్ బృందాలు తనిఖీలు చేశాయి. చెయ్యేరు ప్రాంతంలో సుమారు 300 ఎకరాల విస్తీర్ణంలో ఈహెచ్‌పీ వ్యాధి ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించింది. చెయ్యేరులోని 8 అనుమానిత చెరువుల్లోనుంచి శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. దాదాపు అన్ని చెరువులు 40 నుంచి 60 రోజుల కల్చర్ దశలో ఉండగా 90 నుంచి 100 కౌంట్ ఉండాల్సి ఉండగా ఎదుగుదల లేక 180 నుంచి 200 కౌంట్ కనిపించింది. మొత్తం మీద నాణ్యత లేని సీడ్ వల్లనే రైతులు ఈ నష్టాలను చవిచూడాల్సి వచ్చిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.ఆక్వాకల్చర్‌లో (ముఖ్యంగా రొయ్య సాగులో) చాలా భయం కలిగించే వైరస్ ఈహెచ్‌పీ. ఇది ఒక మైక్రోస్పోరిడియన్ పరాన్నజీవి. ఇది వైరస్ కాదు కానీ చాలా మంది రైతులు దీన్ని "%జున్రూ% వైరస్" అనే అంటారు. ఈహెచ్‌పీ వల్ల రొయ్యల హెపటోపాంక్రియాస్ ని దెబ్బతీస్తుంది. జీర్ణక్రియ తగ్గిపోతుంది, ఆహారం సరిగ్గా జీర్ణం కాదు, పెరుగుదల చాలా నెమ్మదిగా ఉంటుంది. రొయ్యలు చిన్నగానే ఉండిపోతాయి, 60–80 రోజాలకే 10–15 గ్రాములు కూడా రాకపోవచ్చు. మరణం ఎక్కువగా ఉండదు కానీ ఉత్పత్తి భారీగా పడిపోతుంది. 30 శాతం నుంచి 70 శాతం వరకు నష్టం వాటిల్లుతుంది. రొయ్యలు పెరగడం ఆగిపోవడం, పొట్ట ఖాళీగా ఉండటం, గట్ కనిపించకపోవడం, రొయ్యల సైజు ఒకేలా లేకపోవడం, మెత్తని షెల్, శరీరం లేత రంగు, వైట్ ఫీకల్స్ కొన్నిసార్లు కలిసి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈహెచ్‌పీ వ్యాధితో ఉన్న నాసిరకం సీడ్‌ను రైతులకు అంటగడుతున్న హేచరీ మోసాలపై ఏపీ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆక్వా రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈహెచ్‌పీ వ్యాధి ఉన్న సీడ్‌ను బాపట్లకు చెందిన హేచరీ అంటగట్టి మోసం చేసింది. దీనిపై ఇప్పటికే పిర్యాదు చేసినా అధికారులు ఆ హేచరీపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని రైతులు చెబుతున్నారు.



## ఓట్ల రాజకీయంలో కుదేలవుతున్న ఆర్థిక వ్యవస్థ !

సమాజాం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలను ప్రభుత్వాలు అస్సలు పట్టించుకోవడం లేదు. ఏదైనా ఘోరం జరినప్పుడు సంతాపం తెలియచేయడం. .తరవాత మర్చిపోవడం షరమామూలుగా మారింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పాలనలో కొత్తదనం కనిపించడంలేదు. భవిష్యత్ నిర్మాణం దిశగా వారి ఆలోచనలు లేవు. అధికారం ఉందికదాని ప్రజాధానం వృధాగా ఖర్చు చేస్తున్నారు. లక్షల కోట్లు అప్పులు చేసి కుప్పలు పెడుతున్నారు. కెసిఆర్, జగన్ బాటలోనే రేవంత్, చంద్రబాబు నాయుడుల పాలన సాగుతోంది. ఉట్టి కెగరలేనమ్మ ఆకాశానికి ఎగిరిందన్న రీతిలో పాలకుల తీరు ఉంది. తెలంగాణలో స్థానిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఇక్కడ గ్రామాల్లో ప్రధానంగా కోతల బెడద విపరీతంగా ఉంది. గత సిఎం కెసిఆర్ కోతులు వాపస్ పోవాలె అని నినాదం ఇచ్చారు. అది అక్కడికే ఆగిపోయింది. కోతులుకూడా కెసిఆర్‌వి కోతలే అనుకున్నాయేమో గ్రామాలు వదలడం లేదు. గ్రామాలు మొదలుకుని పట్టణాల వరకు వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. మొన్నటికి మొన్న వీధి కుక్కల బారిన పడి ఓ మూగబాలుడు ఆస్పత్రి పాలయ్యాడు. వీటిని నిరోధించే కార్యక్రమం చేపట్టడం లేదు. కోతుల కారణంగా తెలంగాణ పల్లెల్లో జనజీవనం తీవ్ర ప్రభావం చూపుతోంది. పంటలు నాశనం అవుతున్నాయి. ఇళ్లన్నీ ధ్వంసం అవుతున్నాయి. ప్రజలపై పడి రక్కుతున్నాయి. దీంతో ప్రతి ఇల్లూ ఓ జైలులాగా తయారయ్యింది. ఇంటికి గేట్లు పెట్టుకుని ప్రజలు తాళాలు వేసుకుంటున్నారు. తినడానికి గతిలేని వారు కూడా ఇంటికో గేటు పెట్టుకోవడం తప్పనిసరి అయ్యింది. తెలంగాణతో పాటు దేశం యావత్తూ సమస్య ఉందన్నారు. దీనిపై జాతీయ విధానం తీసుకోవాలని, కోతుల నిర్మూలన చర్యలు తీసుకోవాలని కోరారు. కానీ ఆయన అధికారపార్టీ ఎంపి అయినా చెవిటివాడి ముందు శంఖం పూరించినట్లే. దీనిపై స్పందిస్తారని అనుకోవడానికి లేదు. ఎందుకంటే పార్లమెంట్ ఆవరణలోకి కుక్కతో వచ్చారని కాంగ్రెస్ ఎంపి రేణుకాచౌదరిపై అధికార పార్టీ ఎంపి జగదాంబికాపాల్ రచ్చ చేశారు. ఇలాంటివి చేయడం సులభమే కానీ..వీధి కుక్కల బెడదను తప్పించే ప్రయత్నం మాత్రం చేయరు. ఇక ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉచిత బస్సు పేరుతో వందలకోట్లు తగలేస్తున్నారు. ఉచిత బస్సు బదులు టిక్కెట్ల రేట్లు తగ్గించి, రోడ్లు వేసి, బస్ సర్వీసులను పెంచితే ప్రజలందరికీ ఉపయోగం. ఇవన్నీ ఎందుకు చర్చించాల్సి వస్తోందంటే సామాజిక సమస్యలపై ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యంగా ఉంటున్నాయి. గ్రామాల్లో కోతులు నిర్మూలించే వారికే ఓటు వేస్తామని పలు గ్రామాల్లో ప్రకటనలు చేస్తున్నారు. పోస్టర్లు అంటిస్తున్నారు. ఇది ప్రభుత్వానికి సిగ్గుచేటు. దీనిగురించి ఆలోచించాలి. ఇదొక్కటే కాదు..ఉచితాలపై ఆలోచించాలి. సమాజాన్ని నిర్వీర్యం చేస్తున్న ఉచిత పథకాలపై ఆలోచన చేయాలి. లేకుంటే దేశం అధోగతి పాలు కాగలదు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో పోటీపడి అమలు చేసే ఉచిత పథకాల వల్ల అభివృద్ధి కుంటు పడుతుందని గుర్తించాలి. అప్పులు చేసి ఉచిత పథకాలను అమలు చేయడం మంచిది కాదని వీరు గుర్తించడం లేదు. ఉచిత బియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి. ఇవే కాకుండా దండగమారి ఖర్చులు కూడా తగ్గించాలి. హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాల ఖర్చులు కూడా వేలకోట్లల్లో ఉంటున్నాయి. రాజకీయ నాయకులు తమ పర్యటనలు, వ్యక్తిగత ఖర్చులు చూస్తే గుండె గుభేల్ మంటోంది. మాజీ సిఎం కెసిఆర్ ఐటి రిటర్న్ కూడా ప్రభుత్వ డబ్బులతోనే వెళ్లదీసారు. అసెంబ్లీకి రాకున్నా జగన్,కెసిఆర్ లక్షల్లో జీతాలు పొందుతున్నారు. నిజానికి ఇవన్నీ తగ్గించు కోవాల్సిందే. ప్రజలనుకూడా ఉచిత పథకాలతో సోమరిపోతులను తయారుచేయడం తప్ప మరోటి కాదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అభివృద్ధికి సూచిక కానేకాదు. ఈ పథకాన్ని అమలుచేయాలని మహిళలెవరూ కోరలేదు. దీనిని గొప్పగా ప్రకటించుకుని ఇన్ని వందల కోట్లు ఆర్టీసికి కట్టామని చెప్పు కోవడం సిగ్గుచేటు. అర్హులైన పేదవారి అభివృద్ధికి ప్రభుత్వాలు నిర్మాణాత్మకమైన సహాయ సహకారాలు అందించడంలో తప్పులేదు. అయితే ప్రజలను సోమరిపోతులుగా మార్చే ఉచిత పథకాలు ప్రగతిని దెబ్బతీస్తాయి. ఉచిత పథకాల వల్ల అనర్హులు సైతం వాటిని పొందడం ఎలా అని చూస్తున్నారు. తప్పుడు మార్గాలు అవలంబించి తమ పేర్లు పథకాల్లో ఉండేలా పైరవీలు చేస్తున్నారు. మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం పథకం వల్ల ఒరిగేదమి లేదు. ఆ డబ్బులను రోడ్లు బాగు చేయడానికి, బస్ టిక్కెట్ రేట్లను తగ్గించి, సర్వీసులను పెంచడానికి ఉపయోగిస్తే బాగుండేది.చార్జీ చెల్లించి ప్రయాణం చేయలేని వృద్దులు, వికలాంగులు, విద్యార్థులు, మహిళలకు ఈ సౌకర్యం కల్పిస్తే అభ్యంతరం ఉండదు. కానీ అందరినీ ఒకే గాటన కట్టి అమలు చేయడం సరికాదు. ప్రభుత్వ ఉద్యోగులైన స్త్రీలు, ఆర్థికంగా ఉన్న స్త్రీలు ఈ పథకాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనవసర ప్రయాణాలు పెరిగాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంత నష్టం కలిగినా ఫరవాలేదు, మా పార్టీ ఎన్నికల్లో గెలవాలనే దుర్నీతిని రాజకీయ పార్టీలు అనుసరించి, ఉచిత పథకాలను అమలు చేస్తున్నాయి. వృద్ధాప్య పింఛన్లు, వికలాంగుల పింఛన్ల విషయంలో అనేక అవకతవకలు బయటపడు తున్నాయి. వాస్తవిక వయసును తగ్గించి, బోగస్ ఆధార కార్డులు పొంది, వృద్ధాప్య పింఛన్లు పొందుతున్న కేసులు ఎన్నో ఉన్నాయి. అంగవైకల్యం లేకపోయినా, డాక్టర్లను మేనేజ్ చేసి అనేకమంది వికలాంగుల పింఛన్లు పొందుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక రేషన్ కార్డులు, బియ్యం జనాభాను మించి అమలు అవుతున్నాయి. రేషన్ కార్డుల ద్వారా పంపిణీ చేసే బియ్యం మాఫీయాలకు ఆదాయ వనరుగా మారింది. ఎపిలో పోర్టు నుంచి టన్నులకొద్దీ బియ్యం తరలినట్లు ప్రభుత్వమే గుర్తించింది. ప్రభుత్వం కిలో బియ్యానికి 42 రూపాయలు ఖర్చు చేస్తోంది. రేషన్ బియ్యం తినడానికి ఇష్టపడని ప్రజలు కేజీ 12 రూపాయల వంతున బయట అమ్ముకుంటున్నారు. వేల కోట్ల రూపాయలు ప్రజాధనం ఇలా వృథా అయిపోతోంది. ఈ విషయంలో పత్రికలు గానీ, రాజకీయ నాయకులు గానీ, ప్రభుత్వ అధికారులు గానీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గానీ, జాతీయవాద సంస్థల నాయకులు గానీ చర్చించడం లేదు. ఎక్కడ తమ ఓట్లు పోతాయో అన్న భయం వారిని వెన్నాడుతోంది. అందుకే విపక్షంలో ఉన్నవారు సైతం ఉచిత పథకాలు మరిన్ని అమలుకు పట్టుబడుతున్నారు. ఉచిత పథకాలకు ఖర్చు చేసే ధనాన్ని మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేస్తే రాష్ట్రాలు బాగుపడతాయి. విద్య,వైద్యరంగాలకు ఖర్చు చేయాలి. రోడ్లు అభివృద్ధి చేయాలి. కోతులు, కుక్కలను తరిమేందుకు ఉపయోగించాలి. దోమల నివారణకు ఉపయోగిం చాలి. చెత్త వేయకుండా నిరోధించాలి. ఇలా దీర్ఘకాలిక ప్రయోజనాలు నెరవేరుతాయి. అప్పుడే రాష్ట్రలు స్వయంశక్తితో ముందుకు సాగుతాయి. ఇందుకోసం ప్రజలే నడుం బిగించాలి.

## ఎంత సంపాదించినా.. ఈ లక్షణాలు ఉంటే మీరు ఆర్థికంగా పేదవాళ్లే!

**ఎంత సంపాదించినా ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని చెప్పే 10 సంకేతాలు**

**జీతం మొత్తం నెల తిరిగేలోపే ఖర్చులు, ఈఎంఐలకే సరిపోవడం**

**అత్యవసర నిధి, సరైన బీమా కవరేజ్ లేకపోవడం**

**సాధారణ అవసరాలకు కూడా అప్పులు చేయాల్సి రావడం**

**ఈ లక్షణాలు ఆర్థిక ఒత్తిడికి సూచనలని నిపుణుల విశ్లేషణ**



చూడటానికి మంచి ఉద్యోగం, నెలనెలా చేతికి వచ్చే అధిక జీతం, సౌకర్యవంతమైన జీవితం... ఇవన్నీ ఉన్నప్పటికీ మీరు ఆర్థికంగా తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నారేమో తెలుసా? బయటకు కనిపించే హోదాకు, వాస్తవ ఆర్థిక స్థితికి మధ్య చాలా తేడా ఉండవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సంపాదన ఎంత అన్నదానితో సంబంధం లేకుండా, కొందరు నిరంతరం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటారు. ప్రముఖ ఆంగ్ల పత్రిక 'మింట్' ప్రచురించిన ఒక కథనం ప్రకారం, ఒక వ్యక్తి ఆర్థికంగా ఎంత ఒత్తిడిలో ఉన్నాడో చెప్పేందుకు పది కీలక సంకేతాలు ఉన్నాయి. ఈ లక్షణాలు ఎవరిలో ఉన్నా, వారి జీవనశైలి ఎంత సౌకర్యవంతంగా కనిపించినా, వారు ఆర్థికంగా ప్రమాదపు అంచున ఉన్నట్లేనని ఆ కథనం విశ్లేషించింది.

**ఆర్థిక ఒత్తిడికి సంకేతాలు ఇవే:**

వచ్చే జీతం నెల తిరిగేలోపే ఇంటి అద్దె, నిత్యావసరాలు, ప్రయాణ ఖర్చులకే పూర్తిగా సరిపోవడం మొదటి సంకేతం. జీతం రావడంలో కొద్దిగా ఆలస్యమైనా రోజువారీ జీవితం గడవటం కష్టంగా మారుతుంది. దీనికి తోడు, కరెంట్ బిల్లులు, నెలవారీ ఈఎంఐలు సకాలంలో చెల్లించలేకపోవడం కూడా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందికి సూచిక. సంపాదనలో అధిక భాగం వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డు బిల్లుల వడ్డీలకే పోతుండటం మరో ముఖ్యమైన లక్షణం. అసలు తగ్గకుండా వడ్డీలే చెల్లిస్తూ పోవడం ఒక విష వలయంలా మారుతుంది. క్రెడిట్ కార్డులు ఎప్పుడూ గరిష్ఠ పరిమితికి చేరుకోవడం, నిత్యావసర వస్తువులు కొనడానికి కూడా స్నేహితులు లేదా బంధువుల వద్ద అప్పు చేయాల్సి రావడం ప్రమాద ఘంటికలే.అనారోగ్యం, వాహనాల మరమ్మతులు వంటి అత్యవసర పరిస్థితుల కోసం ప్రత్యేకంగా పొదుపు (ఎమర్జెన్సీ ఫండ్) లేకపోవడం, సరైన ఆరోగ్య బీమా కూడా లేకపోవడం మిమ్మల్ని మరింత ప్రమాదంలోకి నెడుతుంది. ఆఫర్లు, డిస్కౌంట్లు చూసి సంపాదనకు మించి ఖర్చు చేయడం, అనవసర వస్తువులు కొనడం వల్ల కూడా ఆర్థిక ప్రణాళిక దెబ్బతింటుంది. ఇక చివరి దశలో, సాధారణ ఖర్చుల కోసం బంగారు ఆభరణాలు, ఇతర ఆస్తులను అమ్ముకోవాల్సి రావడం తీవ్రమైన ఆర్థిక సంక్షోభానికి నిదర్శనం.ఈ లక్షణాలు ఉంటే వారి ఆర్థిక పరిస్థితి సురక్షితంగా లేదని అర్థం చేసుకోవాలని ఆ కథనం స్పష్టం చేస్తోంది. బయటకు కనిపించే జీవనశైలితో సంబంధం లేకుండా, ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు ఎంత ముఖ్యమో ఈ సంకేతాలు తెలియజేస్తున్నాయి.

# సంపాదించటం అనేది ఒక స్వభావం

**డబ్బు సంపాదనను కేవలం అంకెలతో కొలవలేమనీ, అది మన ప్రవర్తన, భావోద్వేగాలు, నిర్ణయాలపై ఆధారపడి ఉంటుందనీ మోర్గాన్ హౌసెల్ అంటు న్నారు. జీవితంలో నిజమైన ఆర్థిక విజయాన్ని పొందడమే కాకుండా, మనశ్శాంతితో కూడిన తృప్తికరమైన జీవితాన్ని ఎలా గడపాలో చెబుతున్నారు.**

**కూడబెట్టటం... కాపాడుకోవటం**

"ఆర్థిక విజయం సాధించడానికి మీరు ఎంత తెలివైన వారు, చదువులో ఎంత ప్రతిభ చూపారు లేదా ఏ కాలేజీలో చదివారు అనే వాటితో పెద్దగా సంబంధం ఉండదు. ఉదాహరణకు, గ్రేస్ గ్రోనర్ అనే మహిళ దశాబ్దాల పాటు ఒక సాధారణ కార్యదర్శిగా పని చేశారు. ఆమె చాలా మామూలు జీవితం గడుపుతూ, క్రమం తప్పకుండా పెట్టుబడి పెట్టేవారు. ఆమె చనిపోయే నాటికి కోట్లాది రూపాయల ఆస్తి జమయింది! దీనికి భిన్నంగా, లక్షల రూపాయలు సంపాదించే వాల్ స్ట్రీట్ ఎగ్జిక్యూటివ్‌లు లేదా గొప్ప వ్యాపారవేత్తలను చూడండి. అతిగా అప్పులు చేసి, రిస్క్ తీసుకోవడం వల్ల వారు తమ సంపదనంతా పోగొట్టుకున్నారు. శ్రీమంతులు అవటానికి కావాల్సిన నైపుణ్యాలు వేరు, శ్రీమంతులుగా కొనసాగడానికి కావాల్సిన స్వభావాలు వేరు.

**శ్రీమంతులు రెండు రకాలు**

రాక్‌ఫెల్లర్, వాండర్‌బిల్ట్ కుటుంబాల మధ్య ఉన్న పెద్ద వ్యత్యాసాన్ని చూడండి. కార్నెలియస్ వాండర్‌బిల్ట్ మానవ చరిత్రలోనే అతిపెద్ద సంపదలలో ఒక దానిని సృష్టించాడు. కానీ కొద్ది తరాల్లోనే అతని వారసులు విలాసవంతమైన భవనాలు, అద్భుతమైన పార్టీలతో ఆ డబ్బునంతా నీళ్లలా ఖర్చు చేశారు. మరోవైపు, రాక్‌ఫెల్లర్





కుటుంబం అలా చేయలేదు. ఒక సరైన వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. తమ పిల్లలకు స్థాయికి మించి ఖర్చు చేయకుండా నిరాడంబరంగా బతకడం నేర్పించారు. మీ సమయాన్ని, స్వేచ్ఛను తిరిగి పొందడానికి డబ్బును ఒక సాధనంగా వాడటం ఆపి, మిమ్మల్ని అస్సలు పట్టించుకోని వారిని ఆకట్టుకోవటం కోసం ఒక ప్రదర్శనగా మార్చిన మరుక్షణమే తరతరాల సంపద నాశనం అవటం ప్రారంభమౌతుంది.

**చిన్నప్పటి దుర్భర జీవితం**

మీ చిన్నతనంలో చూసిన పరిస్థితులే మీ జీవితాంతం మీరు తీసుకునే ఆర్థిక నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి. ఒక వ్యక్తి స్థోమతకు మించిన ఖరీదైన కారు, పెద్ద ఇల్లు లేదా అవసరం లేకపోయినా బ్రాండెడ్ వస్తు వులు కొనడం చూసినప్పుడు, వారు ఏదో ఆలోచించి ఆ నిర్ణయం తీసుకుంటున్నారని అనుకోకండి. చాలా సందర్భాల్లో, తమ చిన్నతనంలో అనుభవించిన పేదరికం, అభద్రతాభావం లేదా అవమానాలను మర్చిపోవడానికి వారు అలా చేస్తుంటారు. కానీ అసలు సమస్య ఏంటంటే, వస్తువులను కొని మనసులోని పాత గాయాలను మాన్పించుకోవాలని చూడటం ముగింపు లేని, తీర్చలేని ఒక పెద్ద అప్పు లాంటిది.

**శాశ్వత తృప్తి... తాత్కాలిక సంతోషం**

సంతోషం అనేది కొద్దిసేపు మాత్రమే ఉండే ఒక తాత్కా లిక భావోద్వేగం. ఉదాహరణకు, మీరు కొత్త కారు కొన్నప్పుడు లేదా వ్యాపారంలో ఒక గొప్ప విజయాన్ని సాధించినప్పుడు కలిగే క్షణికమైన ఆనందం అది. కానీ తృప్తి అనేది శాశ్వతమైన మనశ్శాంతి. 'నాకు ఉన్నది చాలు' అనే భావనతో ఉండటమే తృప్తి. మీ ఫలితాలతో (సంపాదనతో) పాటే మీ ఆశలు కూడా పెరుగుతూ ఉంటే, మీరు జీవితంలో ఎప్పటికీ శ్రీమంతులుగా అనుభూతి చెందలేరు. మీ ఆశయాలకు ఒక సరిహద్దు అంటూ లేకపోతే, మీ జీవితమంతా ఒక ట్రెడ్‌మిల్ మీద పరిగెత్తినట్లే ఉంటుంది. ఒక గమ్యాన్ని చేరుకోవడం అనేది విశ్రాంతిని ఇవ్వకపోగా, తర్వాతి పరుగు పందెం కోసం మరింత ఒత్తిడితో కూడిన ప్రారంభ స్థానంగా మారుతుంది. –




## పాత కంప్యూటర్ స్పీడ్ పెంచే జియో సర్వీస్

కంప్యూటర్ కొన్నేళ్లు వాడిన తర్వాత నెమ్మదించడం సహజమే. స్టోరేజ్ తగ్గిపోవడం, ర్యామ్ సరిపోకపోవడం, కొత్త సాఫ్ట్‌వేర్‌లు సరిగ్గా పనిచేయకపోవడం వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. ఇలాంటి సమయంలో.. చాలామంది కొత్త కంప్యూటర్ కొనాలని ఆలోచిస్తారు. కానీ అలాంటి వారికోసం రిలయన్స్ జియో 'జియోపీసీ' సేవలను తీసుకొచ్చింది. జియోపీసీ అనేది ఒక క్లౌడ్ ఆధారిత కంప్యూటింగ్ సర్వీస్. అంటే.. మీ దగ్గర ఉన్న పాత కంప్యూటర్‌లోనే క్లౌడ్ ద్వారా అదనపు ర్యామ్, స్టోరేజ్, కంప్యూటింగ్ పవర్‌ను ఉపయోగించుకోవచ్చు. దీంతో కంప్యూటర్ పాతదైనా కొత్త అప్లికేషన్లు, సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించే అవకాశం ఉంటుంది. గతంలో జియోపీసీ అనేది కేవలం జియోహోమ్ బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉండేది. ఇప్పుడు ఏ కంపెనీకి చెందిన ఇంటర్నెట్ కనెక్షన్ ఉన్నా.. ఈ సేవను తీసుకోవచ్చు. అంటే జియో సిమ్ లేదా జియో బ్రాడ్‌బ్యాండ్ తప్పనిసరి కాదు.

**రూ.1,000 నుంచే ప్లాన్స్!**

జియోపీసీలో ప్రస్తుతం రెండు రకాల ఆప్షన్లు ఉన్నాయి. సాధారణ జియోపీసీ ప్లాన్‌లో 8జీబీ ర్యామ్, 500 జీబీ స్టోరేజ్ లభిస్తుంది. జియోపీసీ అల్ట్రాలో 16 జీబీ ర్యామ్, 1 టీబీ స్టోరేజ్ లభిస్తుంది. రెండు నెలల జియోపీసీ ప్లాన్ ధర రూ.1,000 నుంచి ప్రారంభమవుతుంది. జియోపీసీ అల్ట్రా రెండు నెలలకు రూ.1,200గా ఉంది. ఏడాదికి కావాలంటే కూడా దీనికోసం తగిన ప్లాన్ ఎంచుకోవచ్చు. దీనికోసం సంస్థ మల్టిపుల్ ప్లాన్స్ అందిస్తోంది. మూడు, నాలుగేళ్లుగా కంప్యూటర్లను వాడుతున్న వారికి జియోపీసీ చాలా ఉపయోగపడుతుంది. ఎనిమిదేళ్ల పాత కంప్యూటర్లలో కూడా జియోపీసీ ద్వారా ఏఐ ఆధారిత అప్లికేషన్లను ఉపయోగించుకోవచ్చని కంపెనీ చెబుతోంది. ఎందుకంటే.. ఎక్కువ కంప్యూటింగ్ అవసరమయ్యే పనులు క్లౌడ్‌లో జరుగుతాయి. పాత కంప్యూటర్ ఉపయోగించేవారు.. రిలయన్స్ జియో తీసుకొచ్చిన జియోపీసీ ఉపయోగించుకుంటే బహుశా వెంటనే కొత్త కంప్యూటర్ కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండకపోవచ్చు.

# ఎప్పుడూ విమానంలో ఉంటారు..

## ఎంత సంపాదిస్తారు?



**విమానంలో ఉద్యోగం చాలామందికి డ్రీమ్ జాబ్. ముఖ్యంగా విమానంలో ప్రయాణికులందరినీ చిరునవ్వుతో పలకరించే క్యాబిన్ క్రూ ఉద్యోగం అంటే ప్రత్యేక ఆసక్తి ఉంటుంది. ప్రయాణాలు, కొత్త వ్యక్తులతో పరిచయాలు, విమానయాన రంగంలో కెరీర్.. ఇలా ఎన్నో ఆకర్షణలు ఈ ఉద్యోగంలో ఉన్నాయి. దేశంలో వేగంగా విస్తరిస్తున్న విమానయాన సంస్థల్లో ఒకటైన ఇండిగోలో క్యాబిన్ క్రూగా పనిచేస్తున్నవారు ఎంత సంపాదిస్తున్నారో తెలుసుకోవాలని చాలామందికి ఉంటుంది. ఈ నేపథ్యంలో 2026లో అందుబాటులో ఉన్న పరిశ్రమ అంచనాల ప్రకారం అనుభవాన్ని బట్టి ఇండిగో క్యాబిన్ క్రూ సంపాదనలెంతో ఈ కథనంలో తెలుసుకుందాం..**

**కొత్తగా చేరేవారికి ఇలా..**

ఏవియేషన్‌ఇూ2 నివేదిక ప్రకారం, ఇండిగోలో కొత్తగా క్యాబిన్ క్రూగా చేరినవారు సాధారణ ఫ్లయింగ్ డ్యూటీలు ప్రారంభించిన తర్వాత నెలకు సుమారు రూ.40,000 నుంచి రూ.55,000 వరకు సంపాదించవచ్చు. అయితే ఇది స్థిరమైన జీతంగా భావించకూడదు. ఫ్లయింగ్ గంటలు, నెలవారీ రోస్టర్, రూట్, ప్రోత్సాహకాలు, పనిచేసే బేస్ లొకేషన్ వంటి అంశాల ఆధారంగా అసలు నెలవారీ ఆదాయం మారవచ్చు.

**అనుభవం పెరిగితే..**

రెండు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాల అనుభవం, ఎక్కువ ఫ్లయింగ్ యాక్టివిటీ ఉన్న క్యాబిన్ క్రూకు ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది. అందుబాటులో ఉన్న పరిశ్రమ అంచనాల ప్రకారం అనుభవజ్ఞులైన సిబ్బంది నెలకు రూ.60,000-- రూ.85,000 వరకు సంపాదించవచ్చు. ఇందులో ఫ్లయింగ్ అలవెన్సులు, ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహకాలు, రూట్ అసైన్‌మెంట్లు వంటి అంశాలు ప్రభావం చూపుతాయి. అందుకే ప్రతి నెలా వచ్చే మొత్తం ఒకేలా ఉండకపోవచ్చు.

**సీనియర్ స్థాయిలో రూ.1.2 లక్షల వరకు..**

కెరీర్‌లో ముందుకు వెళ్లి లీడ్ క్యాబిన్ అటెండెంట్ లేదా ఇన్‌ఫ్లైట్ సూపర్‌వైజర్ వంటి బాధ్యతలు చేపట్టినవారికి ఆదాయం మరింత ఎక్కువగా ఉండొచ్చని ఏవియేషన్‌ఇూ2 అంచనా వేసింది. బలమైన ఫ్లయింగ్ షెడ్యూల్, అధిక బాధ్యతలు ఉన్న సమయంలో వీరి నెలవారీ సంపాదన సుమారు రూ.90,000 నుంచి రూ.1.20 లక్షల వరకు ఉండొచ్చు.

**జీతంతో పాటు మరిన్ని ప్రయోజనాలు**

క్యాబిన్ క్రూ ఆదాయం కేవలం బేసిక్ పేకు పరిమితం కాదు. ఫ్లయింగ్ అలవెన్సులు, కొన్ని సందర్భాల్లో లేఓవర్ సంబంధిత ప్రయోజనాలు, స్టాఫ్ ట్రావెల్ వంటి సదుపాయాలు మొత్తం ప్యాకేజీలో భాగం కావచ్చు. ముఖ్యంగా అంతర్జాతీయ కార్యకలాపాలు పెరుగుతున్న కొద్దీ రూట్, డ్యూటీ స్వభావం కూడా ఆదాయంపై ప్రభావం చూపే అంశంగా మారుతోంది.

**మూడు నెలల శిక్షణ తప్పనిసరి**

ఇండిగో అధికారిక సమాచారం ప్రకారం, విమానంలో ఫ్లయింగ్ క్రూగా విధులు ప్రారంభించే ముందు క్యాబిన్ క్రూ సిబ్బంది మూడు నెలలపాటు ఇంటెన్సివ్ ట్రైనింగ్ పొందుతారు. ప్రయాణికుల భద్రత, అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడం, సేవా ప్రమాణాలు తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు.

# కియా వారి నయా కారు?

కియా మోటార్స్ భారతదేశంలో కొత్త సోరెంటో ఎస్‌యూవీని రూ.27.99 లక్షల (ఎక్స్-షోరూమ్) ప్రారంభ ధరతో లాంచ్ చేసింది. ఇది ఇండియన్ మార్కెట్లో ఇప్పటికే అమ్మకానికి ఉన్న టయోటా ఫార్చ్యూనర్, స్కోడా కోడియాక్, జీప్ మెరిడియన్, ఫోక్స్‌వ్యాగన్ టేరాన్ వంటి మోడళ్లకు ప్రత్యర్థిగా ఉంటుంది. మల్టిపుల్ వేరియంట్లలో అందుబాటులో ఉన్న కియా సోరెంటో 6 సీటర్, 7 సీటర్ రూపంలో అందుబాటులో ఉంది. ఇది 4,815 మిమీ పొడవు, 1,900 మిమీ వెడల్పు, 1,785 మిమీ ఎత్తును కలిగి ఉంది. దీని వీల్‌బేస్ 2,815 మిమీ వరకు ఉంటుంది. కియా సోరెంటో నిలువుగా అమర్చిన హెడ్‌ల్యాంప్‌లు, టైగర్-నోస్ గ్రిల్ వంటి వాటిని పొందుతుంది. ఇందులో 18 ఇంచెస్ అల్లాయ్ వీల్స్ ఉన్నాయి. వెనుక భాగం కూడా ముందు భాగాన్ని పోలి ఉండేలా నిలువుగా అమర్చిన టెయిల్ ల్యాంప్‌లు ఉన్నాయి. ఇది మొత్తం 8 రంగులలో లభిస్తుంది. సరికొత్త కియా సోరెంటో 4 ఇంచెస్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌తో కూడిన 12.3-అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్ లేదా దానికి సరిపోయే 12.3-అంగుళాల డిజిటల్ డిస్‌ప్లే పొందుతుంది. కియా కనెక్ట్ 2.0, ఓవర్-ది-ఎయిర్ అప్‌డేట్‌లు, డిజిటల్ కీ, హెడ్-అప్ డిస్‌ప్లే, జనరేటివ్‌-ఇూ× అసిస్టెంట్ వంటివి కూడా ఉన్నాయి. ఇవి కాకుండా.. వెంటిలేటెడ్ ఫ్రంట్ అండ్ రియర్ రో సీట్లు, 10-వే ఎలక్ట్రిక్ డ్రైవర్ సీటు, ముందు ప్రయాణీకుడి సీటు కోసం పవర్ అడ్జస్ట్,



పనోరమిక్ సన్‌రూఫ్, యాంబియంట్ లైటింగ్, పవర్డ్ టెయిల్‌గేట్, 12-స్పీకర్ల బోస్ ఆడియో సిస్టమ్ వంటికి ఉన్నాయి. సేఫ్టీ విషయానికి వస్తే.. ఇందులో ఏడు ఎయిర్‌బ్యాగ్‌లు, 26-ఫీచర్ల భద్రతా ప్యాకేజీ ఉన్నాయి. టాప్ ఎండ్ మోడల్స్ పది ఎయిర్‌బ్యాగ్‌లు, 28 వరకు భద్రతా ఫీచర్లను పొందుతాయి. ఇందులో లెవెల్ 2ం ఏడీఏఎస్, సరౌండ్-వ్యూ, బ్లైండ్-వ్యూ మానిటర్లు, రిమోట్ పార్కింగ్ అసిస్టెన్స్, డిజిటల్ ఇన్‌సైడ్ రియర్-వ్యూ మిర్రర్, ఫ్రంట్ అండ్ రియర్ డాష్‌క్యామ్, మల్టీ-కొలిజన్ బ్రేకింగ్ ఉన్నాయి. కియా సోరెంటో అనేది స్ట్రాంగ్-హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్, ఆల్-వీల్ డ్రైవ్ పొందిన కియా ఇండియా మొదటి మోడల్. ఇది డీజిల్ ఇంజన్‌ను కూడా అందిస్తుంది. హైబ్రిడ్ వెర్షన్‌లో 1.6-లీటర్ పెట్రోల్ ఇంజన్‌తో పాటు ఒక ఎలక్ట్రిక్ మోటార్ లభిస్తుంది. ఇంజన్ 180 హార్స్ పవర్ ఉత్పత్తి చేయగా, ఎలక్ట్రిక్ మోటార్ 65 హార్స్ పవర్ అందిస్తుంది. ఈ రెండింటి సంయుక్త అవుట్‌పుట్ 238హార్స్ పవర్. హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్ 265 ఎన్ఎమ్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది.



## పసిడి ప్రియులకు షాక్.. రూ.4600 పెరిగిన బంగారం!

తగ్గేదేలే అన్నట్లు.. బంగారం ధరలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. భారతదేశంలో రెండు రోజుల్లోనే గోల్డ్ రేటు గరిష్టంగా 4640 రూపాయలు పెరిగింది. దీంతో హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, ముంబై, ఢిల్లీ నగరాల్లో పసిడి ధరల్లో ఊహకందని మార్పు కనిపించింది. హైదరాబాద్, విజయవాడలలో సెప్టెంబర్ 2న రూ.1,52,020 వద్ద ఉన్న 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర, ఈ రోజుకు 1,56,660 రూపాయల (రూ.4640 పెరిగింది) వద్ద నిలిచింది. 22 క్యారెట్ల రేటు 1,39,350 రూపాయల నుంచి రూ.1,43,600 వద్దకు (రూ.4250 పెరిగింది) చేరింది. ఇదే ధరలు ముంబై, బెంగళూరులలో కూడా కొనసాగాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రెండు రోజుల్లో రూ. 4640 పెరిగి రూ. 1,56,660 వద్దకు, 22 క్యారెట్ల 10 గ్రాముల రేటు రూ. 4250 పెరిగి రూ.1,43,600 వద్ద నిలిచింది. ఢిల్లీలో కూడా బంగారం ధర భారీగా పెరిగింది.

**ధరలు పెరగడానికి కారణాలు**

బంగారం ధర పెరగడానికి ప్రధాన కారణం డిమాండ్ పెరగడమే. డిమాండుకు తగిన గోల్డ్ అందుబాటులో లేనప్పుడు, కొనుగోలుదారులు ఎక్కువైనప్పుడు తప్పకుండా ధరల్లో గణనీయమైన మార్పు జరుగుతాయి. రాజకీయ, భౌగోళిక కారణాలు కూడా పసిడి ధరలను ప్రభావితం చేస్తాయి.



# కరీనా కపూర్ క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్ మరియు టాలెంటెడ్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'. ప్రముఖ దర్శకురాలు మేఘనా గుల్జార్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో కరీనా కపూర్ ఖాన్ డీసీపీ అజూని కోహ్లీగా, పృథ్వీరాజ్ సుకుమారన్ డీసీపీ రామన్ కుమార్‌గా ప్రత్యర్థి పోలీసు అధికారులుగా కనిపించనున్నారు. చట్టం వర్సెస్ న్యాయం, నకిలీ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అయిన రామన్ కుమార్‌పై మరో పోలీసు అధికారి అజూని కోహ్లీ దర్యాప్తు చేసే తీవ్రమైన సన్నివేశాలతో ట్రైలర్ ఎంతో ఆసక్తికరంగా సాగింది. జంగ్లీ పిక్చర్స్ మరియు పెన్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాను మేఘనా గుల్జార్ యదార్థ ఘటనల ఆధారిత సీరియస్ డ్రామాగా మలిచారు. సస్పెన్స్ మరియు హై-వోల్టేజ్ డ్రామాతో కూడిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 18న విడుదల కానుండగా, ప్రస్తుతం ఈ ట్రైలర్ సినీ వర్గాల్లో భారీ అంచనాలను పెంచేసింది.



# మూడు సినిమాలతో మమిత బైజు హ్యాట్రిక్

'ప్రేమలు'తో ఒక్కసారిగా యూత్ క్రష్‌గా మారిన మమితా బైజు .. ఇప్పుడు ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్‌గా మారింది. తన క్యూట్‌నెస్‌తో కట్టిపడేసే ఈ మలయాళ ముద్దుగుమ్మ.. తాజాగా భారతీయ సినీ చరిత్రలోనే ఎవరూ సాధించని ఒక అరుదైన మైలురాయి చేరుకుంది. కేవలం 29 రోజుల వ్యవధిలో ఈ అమ్మడు నటించిన మూడు సినిమాలు వరుసగా రూ.200 కోట్లకుపైగా వసూలు చేసి.. హ్యాట్రిక్ కొట్టిన తొలి భారతీయ నటిగా చరిత్ర సృష్టించింది. ఎన్నో వాయిదాల తర్వాత జులై 23న వచ్చిన 'జననాయగన్' విజయాన్ని అందుకుంది. విజయ్ నటించిన చివరి చిత్రం కావడంతో భారీ అంచనాలు ఉండడంతో బాక్సాఫీస్ వద్ద ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇందులో మమిత.. విజ్జి పాత్రలో ఆకట్టుకుంది. సూర్య కథానాయకుడిగా విశ్వనాథ్ అండ్ సన్స్..: భారీ చిత్రం విడుదలైన కొద్దిరోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.240 కోట్ల గ్రాస్‌తో ఘన విజయం సాధించింది. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాలో మమిత నటన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అల్లరి చేసే పిల్లగా ఆకట్టుకున్న ఆమె.. అమ్మగానూ హృదయానికి హత్తుకునే నటనతో మెప్పించింది. బె÷-లతెహోమ్ కుటుంబ యూనిట్..: నివిన్ పౌలీతో కలిసి మమిత నటించిన ఈ మలయాళ చిత్రం ఆగస్టు 21న విడుదలై సంచలనం విజయం అందుకుంది.

# విభిన్నమైన కథలతో..

'ఇరుముడి' జోష్ మీదున్న రవితేజ.. ఆలస్యం చేయకుండా వెంటవెంటనే రెండు సినిమాలను లైన్లో పెట్టిన విషయం తెలిసిందే. వాటిలో ఒకటి హసిత్ గోలీ దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మిస్తున్న సినిమా కాగా.. రెండోది వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో లక్ష్మణ్ నిర్మిస్తున్న సినిమా. ఈ రెండు సినిమాలూ రెండు భిన్నమైన కథాంశాలతో తెరకెక్కుతున్నట్టు సమాచారం. హసిత్‌గోలీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైన్మెంట్‌తో సాగుతుందట. హీరో శ్రీవిష్ణు ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో హీరోయిన్లు కూడా ఖరారైనట్టు తెలిసింది. రవితేజకు జోడీగా ఐశ్వర్య రాజేష్ నటిస్తుండగా, శ్రీవిష్ణుతో మాళవిక మోహనన్ జతకట్టనున్నదని వినికిడి. ఈ సినిమా షూటింగ్ ఈ నెలలోనే మొదలు కానున్నది. కేవలం నాలుగు నెలల్లోనే ఈ సినిమా పూర్తి చేసి వచ్చే సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇక వివేక్ ఆత్రేయ సినిమా విషయానికొస్తే.. ఇది హారర్ కామెడీ జానర్ అని తెలిసింది. కథ నచ్చడంతో రవితేజ వెంటనే ఓకే చెప్పారట. ఇదే నిజమైతే రవితేజ నటిస్తున్న తొలి హారర్ కామెడీ సినిమా ఇదే అవుతుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉన్నది.




# టాక్సిక్‌కు హాఫ్ స్టార్ రేటింగ్

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కుమారుడు గౌతమ్ ప్రముఖ సోషల్ మీడియా రేటింగ్ యాప్ లెటర్‌బాక్స్ ద్వారా ఇచ్చిన సినిమా రేటింగ్‌లు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. యశ్ హీరోగా నటించిన 'టాక్సిక్' సినిమాకు గౌతమ్ కేవలం హాఫ్ స్టార్ (0.5) ఇవ్వడం, అలాగే తన తండ్రి మహేష్ బాబు సినిమాలకే కాకుండా ఇతర స్టార్ హీరోల చిత్రాలకు ఇచ్చిన రేటింగ్‌లు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. గౌతమ్ లెటర్‌బాక్స్ ప్రొఫైల్ ప్రకారం.. అతను ఇప్పటివరకు వివిధ భాషలు మరియు జోనర్లకు చెందిన 400లకు పైగా సినిమాలను వీక్షించినట్లు తెలుస్తోంది. అయితే ఇతరులతో సంబంధం లేకుండా, సినిమాల కంటెంట్‌ను బట్టి స్వతంత్రంగా రేటింగ్‌లు ఇవ్వడం ఈ డిబేట్‌కు ప్రధాన కారణమైంది. తన తండ్రి మహేష్ బాబు నటించిన కల్ట్ క్లాసిక్స్ 'పోకిరి' మరియు '1: నేనొక్కడినే' సినిమాలకు గౌతమ్ 5 నక్షత్రాల రేటింగ్ ఇవ్వగా, 'బ్రహ్మోత్సవం' చిత్రానికి కేవలం 1 స్టార్ మాత్రమే ఇచ్చాడు. అలాగే 'నిజం', 'వంశీ' చిత్రాలకు 2 చొప్పున రేటింగ్ ఇచ్చాడు. కేవలం టాలీవుడ్ మాత్రమే కాకుండా పాన్-ఇండియా మరియు హాలీవుడ్ సినిమాలపై కూడా గౌతమ్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. 'బాహుబలి 2' చిత్రానికి 5 స్టార్లు ఇవ్వగా, 'పెళ్లిచూపులు', 'సీతారామం' సినిమాలకు 4.5 రేటింగ్ ఇచ్చాడు.



# నవంబర్ 27న మైసా విడుదల

### రిలీజ్ డేట్ ప్రకటించిన మేకర్స్

కథానాయిక రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేసింది. ఈ చిత్రాన్ని నవంబరు 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ రిలీజ్ డేట్ ప్రకటన సందర్భంగా మేకర్స్ పంచుకున్న క్యాప్షన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.
సహజంగానే ఆమె దృఢమైనది.. ఎంచుకున్న మార్గంలో భయం లేనిది.. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం ఆమె సొంతం. మునుపెన్నడూ చూడని విధంగా 'మైసా' ప్రపంచంలో రష్మికను చూసేందుకు సిద్ధంగా ఉండండి అంటూ చిత్ర బృందం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. మునుపెన్నడూ లేని విధంగా రష్మిక ఈ సినిమాలో పూర్తిస్థాయి యాక్షన్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి. రష్మిక కథానాయిక. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న చిత్రమిది. దసరా కానుకగా అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఇటీవలే చిత్ర బృందం స్పష్టం చేసింది.




EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/